ప్రజాశక్తి

సోమవారం 17 నవంబర్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

శంకర్‌విలాస్ బ్రిడ్జిని పరిశీలించిన
హైకోర్టు కమిషన్

- నిబంధనలు పాటించట్లేదని పౌర సంఘాల వినతి

ప్రజాశక్తి - గుంటూరు

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల నేపథ్యంలో అధికారులు నిబంధనలు పాటించట్లేదని హైకోర్టు దాఖలైన పిల్ నేపథ్యంలో నిర్మాణ పనులను హైకోర్టు నియమించిన అడ్వకేట్ కమిషన్ సభ్యులు ఎం.ఆనంద్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. అరండల్‌పేట, బ్రాడీపేట వైపు వ్యాపారులతో మాట్లాడారు. చట్ట ప్రకారం పరిహారం ఇవ్వకుండా షాపులను తొలగించుకోవాలని నోటీసులు ఇస్తున్నారని వ్యాపారులు వాపోయారు. ముఖ్యంగా సర్వీసు రోడ్డు ఇరు వైపులా 12 అడుగులు ఇస్తామని చెప్పినా నాలుగు నెలలు ఇవ్వకుండా మొత్తం మూసివేసి, ప్రజలకు ఇబ్బంది కలిగించారని పౌర సంఘాల నాయకులు తెలిపారు. కమిషన్ వస్తుందని తెలుసుకొని రాత్రికి రాత్రి కొద్దిమేర అడ్డంకులు తొలగించారన్నారు. అనుమతి పొందిన ప్లాన్‌ను ఇంత వరకూ బయటపెట్టలేదన్నారు. బహిరంగంగా అందరికీ

▶ 2లో

నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషన్ సభ్యులు ఆనంద్‌కుమార్

జెడ్‌పి భేటిపై...
అనిశ్చితి

- సమావేశం నిర్వహించాలని వైసిపి సభ్యుల లేఖ
- ఏ నిర్ణయమూ తీసుకోని చైర్‌పర్సన్ క్రిస్టీనా

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహణపై అధికారులు ఇంకా నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. గతనెల 29న జరగాల్సిన సమావేశం కోరం లేకపోవడం వల్ల వాయిదా పడింది. ఆ తర్వాత త్వరలో సమావేశం నిర్వహిస్తామని చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా ప్రకటించినా ఇంకా నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో సమావేశం నిర్వహించాలని కోరుతూ పలువురు వైసిపి సభ్యులు జిల్లా పరిషత్ సిఈవోకు లేఖలు రాశారు. కానీ అధికారులు, చైర్‌పర్సన్ ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఈనెల 26న జిలా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశం నిర్వహణకు అధికారులు,సభ్యులకు సమాచారం ఇచ్చారు. వాయిదా పడిన సర్వ సభ్య సమావేశంపై ఎటూ తేల్చడం లేదని వైసిపి సభ్యులు అభ్యంతరం చెబుతున్నారు. సమావేశం నిర్వహిస్తే రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం పెట్టాలని వైసిపి సభ్యులు యోచిస్తున్నారు. వైసిపికి ప్రస్తుతం జిల్లా పరిషత్ పాలక మండలిలో మెజార్టీ ఉండటం వల్ల తీర్మానం నెగ్గితే ప్రభుత్వ ప్రతిష్టకు ఇబ్బంది ఏర్పడుతుందని పలువురు సీనియర్ నాయకులు సూచించడంతో సమావేశం నిర్వహణపై చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. వైసిపి నుంచి గెలిచి గతేడాది జనవరిలో చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా టిడిపిలో చేరారు. ఎన్నికల ముందు ఆమెతో పాటు ఒకరిద్దరు టిడిపిలో చేరగా సార్వత్రిక ఎన్నికల తరువాత దఫాల వారీగా

▶ 2లో

బోరుపాలెంలో నిమ్మతోట (ఫైల్)

నిమ్మకు నీరెత్తినట్లు..!

నిమ్మ, అరటి తదితర పంటలను భూసమీకరణ ద్వారా రాజధాని నిర్మాణానికి 2014-15 మధ్య టిడిపి ప్రభుత్వం తీసుకుంది. ఈ భూములను జరీబుగా పరిగణించి కౌలు ఎకరాకు రూ.50 వేలు చెల్లించారు. కొంతకాలం తరువాత వాటిని జరీబు భూములు కాదని, మెట్ట భూములంటూ కౌలును రూ.30 వేలకు తగ్గించారు. జరీబు భూములకు నివాస ప్లాట్లు వెయ్యి గజాలు, కమర్షియల్ ప్లాట్లు 450 గజాలు రిటర్నబుల్ ప్లాట్లుగా ఇవ్వాల్సి ఉండగా మెట్ట భూములకు ఇచ్చే నివాస ప్లాట్లు వెయ్యి గజాలు, కమర్షియల్ 250 గజాలు తీసుకోవాలని చెప్పారు. దీంతో తాము తీవ్ర ఆందోళనకు గురయ్యామని, ఇప్పటివరకు ఎన్నోసార్లు ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకూ పరిష్కారం కాలేదని రాజధాని రైతులు వాపోతున్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

2 లో

ముస్లిముల పేదరికంపై...
చర్చ జరగాలి

అవాజ్ జిల్లా మహాసభలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - గుంటూరు

దేశంలో ముస్లిములు ఎదుర్కొంటున్న పేదరిక సమస్యపై దృష్టి సారించి, వారి అభ్యున్నతికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అవాజ్ జిల్లా 3వ మహాసభ స్థానిక పాతగుంటూరులోని అవాజ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. మహాసభకు జిల్లా అధ్యక్షులు మహబూబ్ సుభాని అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశంలో దాదాపు 16 శాతంగా ఉన్న ముస్లిములు అన్ని సామాజిక తరగతుల కన్నా ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని సచార్ కమిటీ నివేదిక వెలుగులోకి తెచ్చిందని చెప్పారు. ఈ స్థితిలో దేశంలో మతంపై కాకుండా పేదరికంపై చర్చ జరగాలన్నారు. మధ్యయుగ కాలంలోనూ, ఆ తర్వాత బ్రిటీషు పాలనలోనూ హిందూ, ముస్లిములు ఐక్యంగా ఉన్నారని గుర్తు చేశారు. అప్పుడు లేని మత చర్చ ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల కంటే ముస్లిములు వెనుకబడి ఉన్నట్లు జస్టిస్ రాజిందర్ సచార్ కమిటీ నివేదిక పేర్కొందన్నారు. బీహార్‌లో ఇటీవల చేపట్టిన కులగణన కూడా ముస్లిముల వెనుకబాటుతనం గురించి

▶ 2లో

మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం, నూతన కమిటీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయం

ప్రజాశక్తి - పెదకాకాని :వ మండల కేంద్రమైన పెదకాకానిలోని వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటుపల్లి శారద దేవి స్మారక గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే డి.నరేంద్ర కుమార్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలు మనిషి జీవన విధానాన్ని సన్మార్గంలో నడిపే కేంద్రాలని, ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థి కావాలని అన్నారు. దాతల సహకారంతో వర్తక సంఘం ఆధ్వర్యంలో మండలంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమని అభినందించారు. గ్రామంలోని నిరుద్యోగ యువతకు శిక్షణిచ్చే కార్యక్రమాలు చేపట్టి వారికి ఉద్యోగ అవకాశాలు సాధించేలా కృషి బాగుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- తాడేపల్లి : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాడేపల్లి మార్కెట్ సెంటర్ 17వ వార్డు అధ్యక్షులు ఈటే శాంతరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సంతకాలు సేకరించారు. నాయకులు తొట్టెంపూడి వికాస్, బలుగూరి నాగరాజు, ఎర్రమల సంతోష్, మండపాటి అరుణ్ కుమార్, కూడలి విజయ్, ఈటె అజయ్, తొట్టెంపూడి విశాల్, మనోజ్ పాల్గొన్నారు.

పిలవగానే స్టేషన్‌కు రావాల్సిందే

ప్రజాశక్తి - తెనాలి : పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లను సిఐ ఎస్.సాంబశివరావు స్టేషన్‌కు పిలిపించారు. వారు ఏయే కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఒక్కొక్కరిపై ఎన్ని కేసులు నమోదయ్యాయి అనే వివరాలను తెలుసుకున్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంటుందని, ఎక్కడ అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. స్టేషన్‌కు పిలిస్తే కచ్చితంగా హాజరు కావాలని, ప్రవర్తనను పూర్తిగా మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.ప్రకాశరావు పాల్గొన్నారు.

ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - తెనాలి : జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఎఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు కఠెవరంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఐపిఎ ఎస్ఎఫ్ ఎఎస్ఎన్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో బిపి, షుగర్, రక్త శాతం, బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు వైద్యుల సహకారంతో నిర్వహించారు. గ్రామస్తుల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడానికి విద్యార్థులు ప్రత్యేకంగా ఆరోగ్య సూచనలు, జీవనశైలి మార్పులు, మధుమేహం-రక్తపోటు నియంత్రణ పద్ధతులపై సలహాలు అందించారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా నిర్వహించే ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం ఎస్ఎఫ్ మెంటర్ పి.భార్గవి, హాస్పిటల్ ఇన్‌ఛార్జి జి.నందగోపాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.

నిమ్మకు నీరెత్తినట్లు..!

ఏళ్లుగా పరిష్కారానికి నోచని జరీబు రాజధాని రైతుల సమస్య

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం కృష్ణా నదీ తీర ప్రాంత గ్రామాలైన బోరుపాలెం, అబ్బరాజుపాలెం, రాయపూడి, కంఠమరాజు కొండూరు గ్రామాలకు చెందిన రైతులు నిమ్మ, అరటి, కంద తదితర పంటలను పండిస్తారు. ప్రభుత్వం జరీబు భూముల నిర్ధారణకు కొన్ని అంశాలను ప్రామాణికంగా తీసుకుంది. భూములు కృష్ణానదీ తీర ప్రాంతంలో ఉండడం, 20 - 30 అడుగుల లోతులో నీటి లభ్యత, భూముల్లో బోర్లు ఉండడం, ఏడాదికి మూడు పంటలు పండడం లాంటి అంశాలను పేర్కొంది. ఇందుకనుగుణంగా వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సర్వే చేశారు. కృష్ణానదీ తీరంలోని వెంకటపాలెం, లింగాయపాలెం, మందడం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, బోరుపాలెం, అబ్బరాజుపాలెం తదితర గ్రామాల్లోని సుమారు 6 వేల ఎకరాల్లో సర్వే చేసి జరీబు భూముల జాబితాలను రూపొందించారు. అధికారులు నిర్ధారించిన భూములకు జరీబు ప్యాకేజి ప్రకారం ప్లాట్ల కేటాయింపు, కౌలు చెల్లించారు. కొంతకాలం తరువాత రాయపూడి, బోరుపాలెం, అబ్బరాజుపాలేనికి చెందిన సుమారు 150 ఎకరాలను జరీబు భూములు కాదని, మెట్ట భూములని అధికారులు చెప్పడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మెట్ట భూములంటూ ఇచ్చిన కౌలును తిరస్కరించి తమకు న్యాయం చేయాలని ఆందోళన బాట పట్టారు. నిరసనలు, నిరాహారదీక్షలు చేయడంతోపాటు, వినతిపత్రాలు అందజేశారు. కళ్లెదుట నిమ్మ తోటలు, వాటిలో బోర్లున్నా వాటిని జరీబు భూములు కాదని ఎలా అంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు. 2014-19 టిడిపి ప్రభుత్వం హయాంలో సమస్య పరిష్కారం కాలేదని, వైసిపి ప్రభుత్వంలో సరేసరి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా పరిస్థితిలో మార్పు లేదని, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జిని పరిశీలించిన హైకోర్టు కమిషన్

(మొదటి పేజీ తరువాయి)

కనిపించే విధంగా ప్లాన్‌ను వర్క్‌సైట్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. కోర్టు ఆర్డర్లున్నా నోటీసుల అంటించి తొలగిస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. మార్కింగ్ స్పష్టంగా ఇవ్వాలని, మార్కింగ్ దాటి రాకూడదని కోరారు.

పౌర సంఘాలు లేవనెత్తిన సమస్యలను కమిషన్ పరిశీలించింది. జెఎసి నాయకులు మీడియాతో మాట్లాడుతూ ప్లాన్ మార్చాలని, రవాణాకు ఆటంకం లేకుండా ముందుగా ఆర్‌యుబి నిర్మించాలని గత కొన్ని నెలలుగా జెఎసి పోరాడుతుందని చెప్పారు. విస్తరణలో భవనాలు కోల్పోతున్న యజమానులకు పరిహారం ఇవ్వకుండా బ్రిడ్జిని కూల్చి వేశారని అన్నారు. అధికారులు హడావుడిగా బ్రిడ్జిని కూల్చివేసి, రైల్వే శాఖ నుండి అనుమతులు రాకుండానే బ్రిడ్జి కూల్చివేసి ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. హైకోర్టులో గత మూడు నెలలుగా దీనిపై చర్చ జరుగుతోందన్నారు. కోర్టును కూడా తప్పుదోవ పట్టించే విధంగా ఆర్అండ్‌బి, కార్పొరేషన్ అధికారులు భిన్నమైన వాదనలు వినిపించారని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదాకా సర్వీసు రోడ్డు ఇవ్వలేమని ఆర్అండ్‌బి వారు, ముందుగానే రోడ్డు ఇస్తామని కార్పొరేషన్ వారు అఫడవిట్ దాఖలు చేశారని తెలిపారు. ఇరు శాఖలకూ సమన్వయం లేదన్నారు. అంతిమంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కోర్టు ఈ విషయాలను గమనించి కమిషన్ నమియమించిందన్నారు. కోర్టు ఆర్డర్‌ను, కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి పనులు చేపడుతున్నారన్నారు. ప్రజలకు సరైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ 22 సంఘాలు ఉన్న జెఎసి కృషి కొనసాగుతోందని చెప్పారు. అడ్వకేట్ ఎన్.కమలకాంత్, సీనియర్ సిటిజన్స్ నాయకులు వల్లూరి సదాశివరావు, రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు మద్ది రాధాకృష్ణ, కార్పొరేట్ ఆచారి, అరండల్‌పేట, బ్రాడీపేట మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బి.శ్రీనివాసరావు, ఏడుకొండలు, పౌర సంఘాల నాయకులు నళినీకాంత్, విద్యార్థి సంఘాలు, ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు. శంకర్ విలాస్ వద్ద మీడియాతో మేయర్ మాట్లాడుతూ సౌకర్యాలు లేకుండా పనులు చేపడుతున్నట్లు కావాలనే కోర్టులో కేసులు వేశారని అన్నారు. కేంద్ర మంత్రి ఆధ్వర్యంలో కేంద్రం వద్ద నిధులు తెచ్చి బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారన్నారు. అడ్వకేట్స్ ఫీజుల కోసం అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. నిజంగా కొందరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నమాట వాస్తవమేనని, అయితే ఇబ్బందిపడే వారికి ప్రత్యామ్నాయంగా షాపులు వేరొకచోట ఇప్పించే ఆలోచన కూడా మంత్రి చేశారన్నారు. నిర్మాణానికి సహకరించాలని, వ్యాపారులకు ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు.

ముస్లిముల పేదరికంపై చర్చ జరగాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేసిందన్నారు. అయితే దానిని కప్పిపుచ్చటానికి సయ్యద్‌ల అభివృద్ధిని చూపించి, ముస్లిముల మధ్య విభజన తెచ్చే యత్నం చేశారన్నారు. బాలికల చదువు గురించి చర్చించకుండా హిజాబ్‌పై చర్చించటం సరికాదని, ముస్లిముల అభ్యున్నతిపైనే వారి భవిష్యత్ ఆధారపడి ఉందని, ఆర్థికంగా, విద్యాపరంగా బలోపేతం కావాలని చెప్పారు. మూఢనమ్మకాలను విడనాడి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, రాజ్యాంగం కల్పించిన పౌర హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. దీనికోసం అవాజ్, ఇతర సంస్థలు కృషి చేయాలన్నారు. అభ్యుదయ ముస్లిము రచయితల సంఘం అధ్యక్షులు కరిముల్లా మాట్లాడుతూ హిందూ ముస్లిముల ఐక్యతపై, పాలకుల విధానాలపై విమర్శనాత్మకంగా, సందేశంతో కూడిన కవితలు వినిపించారు. ప్రకృతి ప్రజలందరికీ కుల, మత బేధాలు లేకుండా సమానంగా చూసిన విధంగా దేశంలో ప్రజలు ఐక్యంగా ఉండే సంస్కృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ మాట్లాడుతూ అవాజ్ మిగతా సంస్థల వలే మత ప్రాతిపదికన పనిచేసే సంస్థ కాదని, లౌకికవాద ప్రాతిపదికన పనిచేసే సంస్థని అన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు కె.నళినీకాంత్ మాట్లాడుతూ మైనార్టీలపై నేడు జరుగుతున్న దాడులను కేవలం మతం ద్వారానే ఎదుర్కోవటం ద్వారా సమస్య పరిష్కారం కాదన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు అన్ని కలిసి ఐక్యంగా ఎదుర్కొనాల్సిన అవసరం ఉందని, గత కొన్నేళ్లుగా ఆవాజ్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఈ లక్ష్యం కోసం పని చేస్తున్నాయని తెలిపారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి జె.నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా దోపిడీకి గురవుతున్న ఎస్సీ, ఎస్టీలు, ముస్లిములు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కరిస్ట్ అశోక్ మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులకు కల్పించి, స్వేచ్ఛ, సమానత్వం వంటి హక్కుల పరిరక్షణకు పోరాడాలని అన్నారు. జిల్లా కార్యదర్శి షేక్.బాషా కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మహబూబ్ సుబాని, షేక్.బాషా తిరిగి ఎన్నికయ్యారు.

జెడ్‌పి భేటీపై అనిశ్చితి

(మొదటి పేజీ తరువాయి)

12 మంది జెడ్‌పిటిసిలు వైసిపికి గుడ్‌బై చెప్పారు. టిడిపి తరుపున పనిచేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనాపై వైసిపి సభ్యులు గుర్రుగా ఉన్నారు. జిల్లా పరిషత్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై క్రిస్టీనాను లక్ష్యంగా చేసుకుని పలు మార్లు వైసిపి సభ్యులు ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో సర్వసభ్య సమావేశం ఎప్పుడు జరిగినా చైర్‌పర్సన్‌పై విమర్శలు గుప్పించడానికి వైసిపి సభ్యులు సిద్ధంగా ఉన్నారు. దీంతో చైర్‌పర్సన్, అధికారులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

జెడ్‌పిలో మొత్తం 54 స్థానాలకు 2020లో ఎన్నికలు జరగ్గా 53 స్థానాలు వైసిపి గెల్చుకుంది. టిడిపికి శావల్యాపురం జెడ్‌పిటిసి ఒక్కటే దక్కింది. చైర్‌పర్సన్ టిడిపిలో చేరిన తరువాత మొత్తం 54 జెడ్‌పిటిసిల్లో 12 మంది టిడిపిలోకి వెళ్లారు. అయినా వైసిపికి ఇంకా 42 మంది ఉన్నారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం వైసిపి ఏ తీర్మానం పెట్టినా ఆమోదం పొందుతుందని ఆ పార్టీ సభ్యులు ధీమాగా ఉన్నారు. 54 మంది జెడ్‌పిటిసిలతో పాటు ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిపి మొత్తం 82 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో వైసిపికి 42 మంది జెడ్‌పిటిసిలతో పాటు ఇంకా ఐదుగురు ఎమ్మెల్సీల మద్ధతు ఉంది. దీంతో సభ్యులందరూ హాజరయ్యేలా తేదీ,సమయం తీసుకుని సమావేశం ఏర్పాటు చేయాలని తద్వారా వైసిపి విమర్శల దాడిని తిప్పికొట్టలేమని చైర్‌పర్సన్ భావిస్తున్నారు. గత నెల 29న జరిగిన సమావేశానికి ఏడుగురు జెడ్‌పిటిసిలు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాత్రమే సమావేశానికి హాజరవడంతో కోరం లేక వాయిదా పడింది. గతేడాది కాలంలో రెండుసార్లు మాత్రమే పూర్తి స్థాయి సమావేశాలు జరిగాయి. గత ఆగస్టు 4న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు మొత్తం తానై నడిపించారు. మంత్రులు, మెజార్టీ ఎమ్మెల్యేలు రాకపోవడంతో ఆయనే సమావేశాన్ని నిర్వహింపచేశారు. అంతేగాక వైసిపి పల్నాడు జిల్లాలోని జెడ్‌పిటిసిలతో ఆయనకున్న సాన్నిహిత్యం వల్ల ఈ సమావేశాన్ని సజావుగా నిర్వహించేందుకు వైసిపి వారూ పరోక్షంగా సహకరించారు. గతనెల 29న జెడ్‌పి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయగా కోరం లేక వాయిదా పడటం, తిరిగి ఎప్పుడు నిర్వహించాలో నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రస్తుతం అనిశ్చితి పరిస్థితి నెలకొంది.

అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకు

టిడిపి చేబ్రోలు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరామరాజు, అనంత లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చేబ్రోలు

కూటమి అధికారం చేపట్టాక చేబ్రోలు మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై టిడిపి మండల అధ్యక్షులు మైలా వెంకట రామరాజు, ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ వివరించారు. నిర్లక్ష్యానికి గురైన ఆర్ అండ్ బి రహదారులకు చేబ్రోలులో రూ.45 లక్షలతో మరమ్మతులు చేసి ప్రజా రవాణా వ్యవస్థ ప్రజలకు సౌకర్యవంతంగా మార్చామని, పాడి రైతుల అభ్యున్నతిలో భాగంగా రూ.50.60 లక్షలతో 22 గోకులాల నిర్మాణం చేపట్టామని చెప్పారు. రూ.50 లక్షలతో వ్యవసాయ ఆధునీకరణ పనిముట్లు, రూ.10 లక్షల విలువైన కిసాన్ డ్రోన్లను 80 శాతం సబ్సిడీతో రైతులకు అందించామని తెలిపారు. పంట కాల్వలు పూడిక తీయించామన్నారు. వడ్లమూడిలో రూ.40 లక్షలో బీసీ కమ్యూనిటీ హాల్‌కు శ్రీకారం, రూ.35 లక్షల జెడ్‌పి నిధులతో రహదార్లను అభివృద్ధి చేశామని అన్నారు. మండల పరిషత్

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

కార్యాలయానికి మరమ్మతులు చేయించామని, మండల ప్రజా పరిషత్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ కింద 103 రకాల అభివృద్ధి పనులతోపాటు తాగునీరు, పారిశుధ్యానికి పనులు చేపట్టామన్నారు. సొంతిల్లు లేని పేదలకు పిఎంఎవై, డిఎల్‌సియుడిఎ స్కీములో 2155 ఇళ్లను పూర్తి చేశామని తెలిపారు. ఉపాధి హామీ ఎంపి ల్యాడ్స్, ఇతర నిధులతో 88 రకాల అభివృద్ధి పనులను రూ.461.57 లక్షలతో చేస్తున్నట్లు వివరించారు. 45 రకాల గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య పనులను 148.86 లక్షలతో చేశామని, రూ.80 లక్షలతో ఆర్‌డబ్ల్యూఎస్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. రూ.కోటి ఉపాధి హామీ నిధుల ద్వారా అంతర్గత రహదారులు, పారిశుధ్య వ్యవస్థలను మెరుగుపర్చామన్నారు. మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో సిమెంట్ రోడ్లు, ఎస్‌డబ్ల్యూ పిసి షడ్ అప్రోచ్ రోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, ఇతర పనులను రూ.487.45 లక్షలతో చేయించామని చెప్పారు. పి4 ద్వారా నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలుకు విజన్-2047 లక్ష్యాలను నేరవేర్చేందుకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ముందుకెళ్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేఒ మండల ప్రజలకు మూడు దశాబ్దాల అనుబంధమని, ప్రజల విశ్వాసమే పునాదిగా మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని అన్నారు.

గ్రంథాలయోద్యమకారులకు నివాళులు

యడ్లపాడులో మహనీయులకు నివాళి

ఫిరంగిపురంలో... నివాళి అర్పిస్తున్న వెంకటసుబ్బరత్నమ్మ

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ ప్రముఖుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. జగ్గాపురం జడ్పి పాఠశాల ఉపాధ్యాయిని పి.పద్మ మాట్లాడుతూ గ్రంథాలయాల ఏర్పాటు కోసం కరపత్రాల ద్వారా ప్రచారం చేసిన అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూష ణం, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, కె.రంగనాథన్ కృషి, త్యాగం ఫలితమే నేటి గ్రంథాల యాలని చెప్పారు. సీనియర్ పాఠకులు, ప్రజాశక్తి విలేకరి ఎం.రామారావు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా మానవతావిలువలు పెంచుకోవా లని, గ్రంథాలయాల ప్రాముఖ్యాన్ని గుర్తించా లని సూచించారు. గ్రంథపాలకులు సిహెచ్. అంజమ్మ, అభివృద్ధి కమిటీసభ్యులు శివరామకృష్ణ, జె.శేషయ్య, సంజీవరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయటంలో ప్రముఖ పాత్ర వహించిన ప్రముఖులకు సమస్మరణ సభ నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రామయ్య ఎస్సార్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమాలకు నాంది పలికి అభివృద్ధి పరిచిన శ్రీఅయ్యంకి వెంకటరామయ్య గాడిచర్ల హరి సర్వోత్తమరావు పాతూరి నాగభూషణం ఎస్ఆర్ రంగనాథన్ వెలగా వెంకట ప్పయ్య ప్రముఖుల జీవిత చరిత్రను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ గ్రంథాలయాధికారి ఏ.భూషయ్య, స్థానికులు గద్దె రవీంద్ర, జంపాల సాంబశివరావు, ఇంచార్జ్ లైబ్రరీ బి.జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్లశాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న నేతలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమ నాయకులు గాడిచర్ల హరిసర్వో త్తమ్మరావు, అయ్యంకి వెంకట రమణయ్య, యస్.ఆర్.రంగ నాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు ఇంచార్జి గ్రంథాలయాధికారి మాచర్ల మెర్సి పూల మాలలు వేసి నివాళ్ళులర్పించి స్మరించుకున్నారు. శ్రీనివాసరావు, స్వరూప, కిషోర్, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలో రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీ లు నిర్వహించారు. ఉద్యమ ప్రముఖులు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరు నాగ భూషణంను స్మరించుకొని, వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంతగుడిపాడు శాఖ గ్రంథాలయంలో విద్యార్థు లకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆయా శాఖల అధికా రులు కేసరి రమణా రెడ్డి, నాగుల్‌మీరావలి, గ్రామపెద్దలుపాల్గొన్నారు.

ప్రజాశకి - క్రోసూరు

గ్రంథాలయ అధికారిని వై.వీరాంజమ్మ ఆధ్వర్యంలో మూడవరోజు ఆదివారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఐఐఎంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కొత్తూరు నాగభూషణంని స్మరించు కున్నారు. ముఖ్యఅతిథిగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బండారు మైసూర్‌బాబు, రాజగోపాల్ రెడ్డి, కెవి రమణ పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు చిత్ర లేఖనం ఆటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రంథాలయ అధికారి వీరాంజమ్మ మాట్లాడుతూ విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని కోరారు..

ప్రజాశక్తి - ఫిరంగిపురం

గ్రంథాలయా రంగాభివృద్ధికి కృషిచేసిన మహారథులు బి.వి.దాశరధి, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూష ణం, ఎస్.ఆర్.రంగనాథన్ వంటి ఆదర్శమూర్తులను స్మరించుకొని వారి సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ అన్నారు. ఫిరంగిపురం శాఖ గ్రంథాలయ అధికారి ఐ.వి దుర్గారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కవి సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. ముందుగా మండలంలోని కొంతమంది కవుల ద్వారా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన మహానుభావుల చిత్రపటాలకు పూలమాలలు వేయించి ఘన నివాళులర్పింప చేశారు. గౌరవ అతిధులైన కవులు షేక్ మస్తాన్, వెంకటరెడ్డి, ఆలీగర్, సయ్యద్ మహమ్మద్ రఫీ, యనమాల సుందర్, మోచర్ల ఫ్రాన్సిస్ జోసఫ్, విప్పర్ల శౌర్యులు, కృష్ణ భార్గవి, ఆలా వేళాంగిణిరాజు, షేక్‌బాబు మస్తాన్, వెంకట రెడ్డి, గోవిందయ్య, గ్రంథాలయ సిబ్బంది పెరికల జేమ్స్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రంథాల యం ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు శ్రీఅయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, వెలగా వెంకట ప్పయ్య, ఎస్ఆర్ రంగనాథన్, గాడిసర్ల హరిసర్వోత్తమ రావు గురించి వక్తృత్వ పోటీని నిర్వహించారు. సోమవారం 'నేటి సమాజంలో డిజిటల్ గ్రంథాలయాల పాత్ర' అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుంది.

వినతిపత్రం అందజేస్తున్న శాలివాహన సంఘ సభ్యులు

నిందితులను అరెస్టు చేయాలని వినతి

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు మండల కేంద్రంలో ఆదివారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పెదనందిపాడు ఎస్ఐ మధుపవన్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం శాలివాహన సంఘ అధ్యక్షుడు నిజాంపట్నం సుబ్బా రావు మాట్లాడుతూ టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీష్ కుమార్ మృతి బాధాకరమని సతీష్‌కుమార్ ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న వ్యక్తి హత్య జరిగి 36 గంటలు గడిచి నప్పటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమనీ, సతీష్ కుమార్ హత్యకు కారుకులైన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధ మవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పెదనందిపాడు మండలం టిడిపి బీసీ సంఘం అధ్యక్షులు అద్దంకి శివయ్య, శాలివాహన సంఘం నాయకులు చల్లగిరి సామ్రాజ్యం, ధనలక్ష్మి, నాగయ్య,శివాజీ, భూషణం, గోపి, నాగబాబు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

పేకాట స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణం, మండలంలోని జమ్మలమడుక గ్రామంలో పేకాట స్థావరాలు పై పట్టణ, రూరల్ పోలీసులు ఆదివారం దాడులు జరిపారు. పట్నంలోని 26 వార్డు నూరు మసీదు ప్రాంతంలో పట్టణ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పట్టణ ఎస్సైలు పేకాట స్థావరం పై దాడి చేసి, పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద రూ.14వేలు నగదు స్వాధీనం చేసు కున్నారు. మండలంలోని జమ్మలమడుక గ్రామంలో రూరల్ ఎస్సై సంధ్యారాణి సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న తొమ్మిది మంది అదుపులోకి తీసుకుని రూ.2700లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - తెనాలి

ఇంజనీరింగ్ నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పట్టణ వన్ టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక నాజర్ పేటకు చెందిన పవన్ తేజ(24) ఇంజనీరింగ్ చదువుతున్నాడు. తన మిత్రులతో కలిసి శనివారం రాత్రి పార్టీకి వెళ్ళి పొద్దుపోయాక ఇంటికి వచ్చాడు. గమనించిన తల్లి అతనిని మందలించింది. తీవ్ర మనస్థాపానికి గురైన పవన్ తేజ అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. గమనించిన పవన్‌తేజ చెల్లి విషయం తల్లిదండ్రులకు చెప్పింది. వారు పవన్ తేజను వైద్యం నిమిత్తం వెంటనే వైద్యశాల కు తరలించారు. పరీక్షించిన వైద్యులు పవన్ తేజ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆదివారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని పేరు కల పూడి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో శంగారపాటి లక్ష్మి అనే వృద్ధురాలు రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైనది. రాత్రి 10గంటల సమయంలో ఆమె కూతురు, ఆమె ఇద్దరు పిల్లలు నిద్రస్తుండగా ఒక్కసారిగా మంటలు కమ్ముకున్నాయి. వృద్ధురాలకు మెలకువ వచ్చి కేకలు వేయడంతో స్థానికులు సకాలంలో స్పందించి నలుగురిని బయటకు లాగారు. అప్పటికే రేకుల షెడ్డులో పొగలు కమ్ముకున్నట్లు తెలిసినది. కట్టుబట్టలతో స్థానికుల సహకారంతో బయటపడ్డారు. షెడ్డుపైన రేకులు చుట్టూ దడి ఉండటంతో రేకులు కూడా కాలి పగిలిపోయాయి. ఇంటిలో ఉన్న సామానంత బుగ్గిపాలు అయింది.

దగ్ధమైన రేకుల షెడ్డు

రేపు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - మాచర్ల

నిరుద్యోగ యువత మెగాజాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీ స్కిల్ డెవలప్మెంట్, ట్రైనింగ్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కెబిఆర్ కళాలలో ఈనెల 18 ఉదయం 9 గంటలకు మల్టీనేషన్ కంపెనీలతో నిర్వ హించే ఈ జాబ్‌మేళా యువత ఉద్యోగావకాశాలకు ఎంతగానో దోహదపడు తుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు క్వాలిఫికేషన్ సర్టిఫికెట్, రెస్యూమ్, పాన్, ఆధార్‌జిరాక్స్‌లతో హాజరు కావల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు 7842747682, 94921 58153 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-ముప్పాళ్ల

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవనీ ఎస్ఐ పి.అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని మాదల గ్రామంలో ఇటీవల రెండు వర్గాల ఘర్షణకు దిగేందుకు పాల్పడడంతో వారిపై కేసులు నమోదు చేసిన సందర్భంగా గ్రామంలో చట్టవ్యతిరేక కార్యాకలాపాల విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు మాదకద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనీ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. పిల్లలను క్రమశిక్షణతో చదివించుకొని ఉన్నత శిఖరాలను చేరుకునే విధంగా ప్రోత్సాహించాలనీ తద్వారా పేరు ప్రఖ్యా తులు సంపాదించు కోవాలన్నారు. గ్రామంలో కేసులు నమోదైన వారు తక్షణమే లొంగిపోవాలన్నారు. ఎఎస్ఐ నవరాజ్ ముప్పాళ్ల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

KAVURI SUBBARAO COLLEGE OF NURSING

K.S.R. Nagar, Kalyani Nagar Extention, Palakaluru Road, Guntur-6.

Cell: 95732 72727, 92852 72727

M.Sc (N) MANAGEMENT SEATS (GIRLS ONLY)

ADMISSION NOTIFICATION 2025-26

No.	M.Sc. (Nursing) Specialities	Total No.of Seats
1.	Medical & Surgical (Nursing)	3
2.	Psychiatry (Nursing)	3
3.	Obstetrics & Gynecology (Nursing)	3
4.	Community Health (Nursing)	3
5.	Paediatric (Nursing)	3

NO DONATION ★ M.Sc. (N)

మేనేజ్‌మెంట్ సీట్స్ కన్వీనర్ ఫీజుకే ఇవ్వబడును

గౌరవ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)
తెనాలి వారి కోర్టులో
ఓ.యస్.నెం.118/2025

బిట్వీన్:
దాసరి రూపేష్ కుమార్ ...వాది
వర్సెస్
మద్ది రాజేష్ ...ప్రతివాది
టు:
మద్ది రాజేష్, తండ్రి సత్యన్నారాయణ, వయసు 45 సం॥లు, హిందు, వ్యాపారం, R/o Plot No. 3-B, రామ్స్ గోకుల్ రెసిడెన్సీ, 1వలైను, పాత పట్టాభిపురం, గుంటూరు, గుంటూరు జిల్లా.

తన బాకి రాబట్టుటకు గాను వాది పైన పేర్కొన్న న్యాయస్తానములో మీపై దావా వేసియున్నారు. గౌరవ కోర్టువారు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ కావాలనే మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. గౌరవ కోర్టు వారు మీకు ఈ దిన పత్రిక ద్వారా నోటీసులు జారీ చేయవలసినదిగా ది.14-11-2025న ఆదేశించియున్నారు. కావున ది.15-12-2025న పైన పేర్కొన్న గౌ.న్యాయస్థానమునందు మీరు స్వయంగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలసినది. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయటమైనది.

(గౌరవ కోర్టు వారి ఆదేములతో)
నన్నపనేని మాధవరావు
మరియు సహచర న్యాయవాదులు, తెనాలి.
సెల్.నెం.9493244873.

జల్ జీవన్ మిషన్ పనులకు గ్రహణం.!

తవ్విన గుంతలు

పైపులు లీకు కావడంతో రోడ్డుపైకి చేరిన నీరు

ప్రజాశక్తి - రాజుపాలెం

ప్రజల దాహార్తిని తీర్చే జల్ జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకం లక్ష్యాన్ని చేరుకోలేక సత్తిగిల పడింది. అడుగడుగున పైపులు లీకులు, కొరవడిన అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన జల్ జీవన్ మిషన్ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. లక్షల ఖర్చు తో రాజుపాలెం మండల కేంద్రంలో చేపట్టినా బిందెడు నీళ్ళు రానీ పరిస్థితి. అధికారులు పట్టించుకోరు. కాంట్రాక్టర్ పనులు చేయరు. ఫలితంగా తాము నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు పెట్టే గగ్గోలు అరణ్య రోదనగా మిగులుతోంది. ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిని ఏర్పాటు చేసి 55 లీటర్ల స్వచ్ఛమైన తాగునీటిని అందింస్తామన్న లక్ష్యానికి నేడు నిర్లక్ష్య గ్రహణం పట్టింది. రూ.72.2 లక్షల వ్యయంతో చేపట్టిన పనులతో 799 ఇళ్ళకు కుళాయి కనెక్షన్ ఇవ్వాలి. ఇప్పటి వరకు ఇచ్చిన కనెక్షన్ లలో చాలా వరకు బిందెడు నీళ్ల రావడం గగనమైంది. మరి కొన్ని కనెక్షన్లకు నీళ్ళు చుక్క నీరు రావడం లేదు. పనులు వదిలేయడం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రజలు అష్ట కష్టాలు పడాల్సిన పరిస్థితిలు నెలకొన్నాయి.

రూ.లక్షలు ఖర్చు పెట్టినా రానీ బిందెడు నీళ్లు
అసంపూర్తి పనులతో ప్రజలకు అవస్థలు

నీళ్ళు సరిగా రాక, తవ్విన గుంతలు నెలలు గడుస్తున్న పూడ్చక అనేక మంది వృద్ధులు, వికలాంగులు గుంతల్లో పడి గాయాలు పాలవ్వడమే కాక, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడం వల్లే పైపులు లీకులు వస్తున్నాయని, ఇచ్చిన కనెక్షన్లలో అధిక శాతం సరిగా నీళ్ళు రావడం లేదని గ్రామస్థులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. జరుగుతున్న పనుల్లో ఉన్న అనేక లోపాలతో పైపులు లీకుల ద్వారా కలుషితమవు తున్న తాగునీరు, అసంపూర్తిగా మిగిలిన పనులతో ప్రజలు పడే ఇబ్బందుల పరిష్కారానికై గ్రీవెన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. ఏదిఏమైనా జల్ జీవన్ మిషన్ పనులపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యల నుంచి విముక్తి కలిగించాలని కోరుతు న్నారు. వరుస పైపుల లీకులు, తవ్వి వదిలేసిన గుంతలు, ఇవ్వాల్సిన కనెక్షన్లపై ప్రజాశక్తి విలేకరి అర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావుని వివరణ కోరగా ప్రభుత్వ నిబంధల మేరకు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు జరుగుతున్నాయనీ, ఇప్పటికే 90శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.

ఉడిజర్ల ఎస్సీ కాలనీలో జ్వరాలు

ప్రజాశక్తి-ఈపూరు

పేరుకు పోయిన మురుగు

మండలంలోని ఉడిజర్ల గ్రామం ఎస్సీ కాలనీలో జ్వరాలతో ప్రజలు మంచం పట్టారు. కాలనీలో సైడుకాలువలో మురుగు నీరు, మంచినీటి ట్యాంక్ వద్ద అధ్వాన్న పారిశుధ్యం, దోమల విజృంభణతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. కొద్దిరోజులుగా జ్వరలక్షణాలతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. సిరిగిరి నరసయ్య, వంగల జాన్ డెంగ్యూ బారిన పడి చికిత్స పొందుతున్నారు. తీవ్ర జ్వరంతో బాలిక అఖిలకు రక్తకణాలు పడిపోగా 108 ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొచ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సుచరిత ఆదేశాల మేరకు కాలనీలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పిహెచ్ఎన్ లక్ష్మీనరసమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ శిబిరంలో 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామనీ, జ్వర పీడితులు లేరని అన్నారు. దోమల నివారణకు కాలనీలో ఫాగింగ్ చేయించడంతోపాటు మురుగు కాలువల వద్ద బ్లీచింగ్ చల్లంచి నట్లు తెలిపారు. ఇంటింటి సర్వే చేపట్టామన్నారు. కార్య క్రమంలో ఎంఎల్ హెచ్ రమణనాయక్, ఏఎన్ఎం విజయలక్ష్మి, మలేరియా వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, సూపర్వైజర్ నరసింహారావు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్ : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభిం చిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ కృతిక శుక్లా కోరారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాక పోయినా, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100కు కాల్ చేయవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు స్వీక రించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పిజిఆర్ఎస్ నేడు (సోమవారం) కలెక్టరేట్లో యధా విధిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని డివి జన్, మండల కార్యాలయాల్లో సమర్పించి పరిష్కరించుకోవచ్చన్నారు.

జగదీష్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల స్విమ్మింగ్ పోటీలకు నరసరావుపేట పట్టణం ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎస్.జగదీశ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్. సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న గుంటూరులోని ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ స్విమ్మింగ్ టీమ్ ఎంపికలలో జగదీశ్ 100 మీటర్లు బటర్ ఫ్లై ఈవెంట్ 1.5 సెకన్లు లోను, 800 మీటర్లు ఫ్రీస్టయిల్ ఈవెంట్ 10.25 సెకన్లలో ఈది ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ (పురుషుల) టీమ్‌కి ఎంపి కయ్యాడని తెలిపారు. వచ్చే నెల 18 నుండి 23వ తేది వరకు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయాల స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనబోతున్నాడని చెప్పారు. జగదీశ్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్- మాజీ మున్సి పల్ ఛైర్‌పర్సన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రెటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాససాయి, వ్యాయమ అధ్యాపకులు డాక్టర్ యక్కల మధుసూదనరావు, అధ్యాపక, అధ్యాపకే తర సిబ్బంది, అభినందించారు.

ఊపందుకున్న 167ఎజి రహదారి విస్తరణ పనులు

చేపట్టిన కల్వర్టు నిర్మాణం

చదును చేసిన మట్టి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కొండమోడు పేరేచర్ల జాతీయ రహదారి 167ఎజి విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రూ.881 కోట్లతో కొండమోడు పేరేచర్ల వరకు నాలుగులైన్ల జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. పేరేచర్ల నుండి కొండమోడు వరకు రోడ్డు వెడల్పు తక్కువగా ఉండి గుంతలు ఏర్పడటంతో గుంటూరు హైదరాబాద్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్తెనపల్లి-పిడుగురాళ్ల మార్గంలో తరచూ రోడ్డు ప్రమాదాల బారినబడి పలువురు మృతి చెందారు. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. వీటన్నిటి దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం కొండమోడు పేరేచర్ల వరకు సుమారు 49.9 కిలోమీటర్ల రాష్ట్ర రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా గుర్తించి విస్తరణకు నిధులు విడుదల చేసింది. భూసేకరణ కూడా పూర్తయి రైతుల ఖాతాల్లో నగదు జమ చేయటంతో పనులు ప్రారంభించారు. రహదారికి ఇరువైపుల ఉన్న భారీ వృక్షాలను తొలగించి మట్టిని చదును చేశారు. గుంటూరు రోడ్డులో ఉన్న చేగుడ్డావా దగ్గర నుంచి వెన్నదేవి వరకు 11కిలోమీటర్ల బైపాస్ రోడ్డు పనులూ వేగవేతంగా జరుగుతున్నాయి. బోదెకాలవలు ఉన్న చోట పెద్ద పెద్ద సిమెంటు గోనెలతో కల్వర్టును నిర్మిస్తు న్నారు. బైపాస్ వెళ్ళే మార్గంలో అమరావతి మేజర్ కాల్వపై వంతెన నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తు న్నారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి నేషనల్ హైవే అధికారులు వంతెన నిర్మించే ప్రదేశాన్ని ఇటీవల పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - వినుకొండ

మాట్లాడుతున్న హరిపోతు రాజు

రాష్ట్రంలో ఆటో కార్మిక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి కేరళ తరహాలో ఆటో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి హరిపోతు రాజు డిమాండ్ చేశారు. జిల్లా సిఐటియు అనుబంధ ఆటో మినీ గూడ్స్ వర్కర్స్ యూనియన్ వినుకొండ మోటారు రంగం మహాసభ ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయం లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తూ అన్యాయం చేస్తుందన్నారు. మోటార్ వాహన చట్టాన్ని తీసుకువచ్చి కార్మికులపై పెనబారాన్ని మోపుతుందని, డ్రైవర్లను జైలు పాలు చేయడమే కాక రూ.లక్షల కొద్ది జరిమానా విధించడమే నూతన మోటార్ వాహన చట్టం అని వివరించారు. మోటార్ వాహన డ్రైవర్లకు వ్యతిరేకంగా ఉన్న చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టెస్టింగ్ వాహనం జిల్లాకు ఒకటే ఉండటం వల్ల మోటార్రంగం కార్మిక ఇబ్బందులు పడుతున్నారని, టెస్టింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటోమేటిక్ టెస్టింగ్ చట్టాన్ని రద్దుచేసి, ఇన్సూరెన్స్ రేట్లు తగ్గించాలని, కేరళ తమిళనాడు తరహాలో ఆటో కార్మిక చట్టాన్ని ఏపీలో అమలు చేయాలని ఆయన కోరారు. డ్రైవర్ లందరికీ ప్రభుత్వం యాప్‌ను తయారు చేసి అందుబాటులో తీసుకురావాలని డిమాండ్ చేశారు. పెనుకొండ పట్టణ కన్వీనర్ అంగల కుదురు ఆంజనేయులు మాట్లాడుతూ డ్రైవర్లు అందరూ లైసెన్సులు పొంది ఉండాలని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబం ధనలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా విన కొండ పట్టణ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ ఉపాధ్యక్షులుగా కె.హనుమంత్‌రెడ్డి, అధ్యక్షులుగా బాలు, ఉపాధ్యక్షులుగా షేక్ కరీముల్లా, కార్యదర్శి ఎం.చాంద్‌బాషా, సహాయ కార్యదర్శిగా కోటి, కోశాధికారిగా సురేష్, కమిటీ సభ్యులు ముసలయ్య ఖాదర్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ మెంబర్ పప్పూరు వెంకటప్పయ్య పాల్గొన్నారు.

వదిలేసినబట్టలు, తినేసిన విస్తరాకులు

అమరేశ్వరా... ఎక్కడ చూసినా చెత్తేనయ్యా ...

ప్రజాశక్తి-అమరావతి

పంచారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయానికి కార్తిక మాసం సందర్భంగా వచ్చే భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఆలయ పరిసరాలు ఆధ్వాన్న స్థితిలో ఉన్నాయి. నిత్యం వేలాది మంది వస్తున్న భక్తులకు తగ్గట్లుగా ఏర్పాట్లు లేకపోవడంతో ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఆలయ నిర్వహణలో అధికారుల తీరు లోపభూయిష్టంగా కనిపిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. వీరంతా ఆలయంలో ఉన్న అపరిశుభ్రను చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా వ్యర్థాలు నిండిపోయి ఉండటంతో అపరిశుభ్రతకు ఆవాసంగా ఆలయ ప్రాంగణం మారింది. ముఖ్యంగా అమరేశ్వరాలయంలోని స్నానఘాట్, పిండ ప్రధానాల ఘాట్లలో ఎక్కడ చెత్త అక్కడే ఉంటుంది. పిండ ప్రధానాలు చేసిన వారు వ్యర్థాలను ఘాట్లోనే వదిలేసి వెళుతున్నారు. వాటి మధ్యనే భక్తులు కార్తిక స్నానాలు చేయాల్సి వస్తోంది. వదిలేసిన బట్టలు, తినేసిన విస్తరాకులు, ప్లేట్లు, అరటి దొప్పలు ఎక్కడ చూసినా అవే కనిపిస్తు న్నాయి. వినాయక, చవితి, దసరా పండుగల సందర్భంగా నిమజ్జనాలకు వచ్చిన భక్తులు వదిలి వెళ్లిన వ్యర్థాలను సైతం ఇంతవరకు తొలగించలేదంటే ఆలయ అధికారుల పనితీరు ఏవిధంగా ఉందో అర్థమవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రజలు ఆలయానికి వస్తుంటారనీ, అలాంటి పరిశుద్ధ ప్రదేశం అపరిశుభ్రతకు చోటు చేసుకోవడం బాధగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రత, చెత్తను తొలగింపును ఓ ప్రయివేటు ఏజన్సీకి అప్ప గించారు. వారి నిర్వహణ సక్రమంగా లేదని పలుసార్లు ఫిర్యాదులు వచ్చినా ఆలయ అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అపరిశుభ్రత వాతావరణం మధ్యనే భక్తులు స్నానాలు చేసి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకోవాల్సి వస్తోంది. అపరిశుభ్రత కారణంగా ఇటీవల ఆలయంలోకి పందులు వచ్చి సంచరించాయని పలువురు భక్తులు పేర్కొంటున్నారు.

ప్రమాదకరంగా ఘాట్ రోడ్

గుంతలమయమైన రహదారి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండల కేంద్రమైన ఫిరంగిపురం నుంచి కార్మెట్ మాత కొండకు వెళ్లే ఘాట్ రోడ్డుకి వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారింది. గుంతలు ఏర్పడి ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఫిరంగిపురం కార్మెల్ మాత కొండ నుంచి అధిక లోడులతో పెద్ద సైజులో ముడి సరుకు రాళ్లను టిప్పర్ లారీల ద్వారా నిత్యం తరలించడం కారణంగా ఈ రోడ్డుపై గుంటలు ఏర్పాడ్డాయని స్థానికులు తెలుపుతున్నారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, పాదచారులు, ప్రజలు వాపోతున్నారు. మధ్యరాత్రి 12 గంటలు దాటిన తర్వాత నుంచి ఉదయం 6 గంటల వరకు పెద్ద పెద్ద గ్రానైట్ రాళ్ల లోడులతో ఈ రోడ్డుపై తిరుగుతున్నాయి. దీంతో తోటి ప్రయాణికులకు, వివిధ వాహనదారులు, ఈ రోడ్డు ప్రక్కన నివాస ప్రాంత ప్రజలు దుమ్మూ ధూళి పడి అనేక ఇబ్బందులు పడుతున్నారు. శబ్దాలకు నిద్ర పట్టక నరకం చూస్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రహదారికి మరమ్మతులు చేయించాని, అలాగే రాత్రి సమయాలలో లారీలతో ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, వకులాభరణం రామకృష్ణ తదితరులు

'దక్షిణాంధ్ర దారి దీపాలు' గ్రంథం ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుంటూరు

దక్షిణ భారతదేశమంతా వెలసిల్లిన తెలుగు సంస్కృతి చాలా ఆసక్తి దాయకమని, శతాబ్దాల తెలుగు వైభవాన్ని దశదిశల విస్తరించి, సంస్కృతి ప్రభావాన్ని తెలియజేసిన ఎందరో మహనీయుల జీవితాలను గ్రంథస్తం చేసిన నాగసూరి వేణుగోపాల్ జీవితం ధన్యమని, విద్యావేత్త, రచయిత ఆచార్య వకులాభరణం రామకృఅష్ణ అన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య బాలుర వసతి గృహంలో 'దక్షిణాంధ్ర దారి దీపాలు" గ్రంథావిష్కరణ సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథావిష్కరణ చేసిన కృష్ణమూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ప్రముఖ పాత్ర పోషించిన తెలుగు మహనీయుల గురించి సమగ్ర పరిశోధన జరగలేదని దక్షిణాంధ్ర దారి దీపాలు గ్రంథం ద్వారా వేణుగోపాల్ ఆలోటును పూడ్చారని అన్నారు. చరిత్ర పరిశోధకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి మాట్లాడుతూ రైతు సంస్కరణలు అమలు చేసిన బబ్బిలి రాజా తమిళ రాష్ట్ర ప్రభుత్వ చక్రం లోగో రూపొందించిన రామస్వామి రెడ్డియార్, వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్న మొదటి వ్యక్తి గధే రంగయ్య నాయుడు, మొదటి దినపత్రిక వ్యవస్థాపకులు దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, మొదటి మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముత్తా వెంకట సుబ్బారావు, తెలుగు సాహిత్యానికి అచ్చు రూపం కల్పించిన వావిళ్ళ రామస్వామి దీక్షితులు వంటి ఎందరో తెలుగు పెద్దల విశేషాలు ఈ గ్రంథం ద్వారా తెలుస్తాయని అన్నారు. గ్రంథ రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, వివిఐటి విశ్వవిద్యాలయం పబ్లికేషన్స్ డివిజన్ సమన్వయకర్త మోదుగుల రవికృష్ణ, డాక్టర్ కామేపల్లి రత్నబాబు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, గద్దె మంగయ్య, గోటేటి లలిత శేఖర్, ప్రొఫెసర్ మురళీమోహన్, ప్రొఫెసర్ ఎన్.వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ జయప్రదం కోసం కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈనెల 23, 24 తేదీల్లో తాడేపల్లి జరిగే సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని బ్రహ్మానందపురంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల మీద చర్చించి, వాటికి రూపకల్పన చేసి, భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపట్టేందుకు సాగుతున్న ఈ జిల్లా మహాసభలకు ఆతిధ్యాన్ని ఇస్తున్న తాడేపల్లి కమిటీ కి అభినందనలు తెలిపారు. ఈ ప్రాంత వాసులు అందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించి ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ సిమెంట్ కంపెనీ కార్మికుల సమస్య గత 33 సంవత్సరాలుగా పరిష్కారం లభించలేదని, యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి 1070 మంది కార్మికులు చనిపోయి, అనేకమంది కార్మికులు అలమటిస్తున్నా, అనారోగ్య పాలవుతున్నా పట్టించుకున్న నాథుడు లేడని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సిమెంట్ కంపెనీ సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సిమెంట్ కంపెనీ కార్మిక పోరాటానికి సిఐటియు అన్నివేళలా ఎసిసి కార్మికులకు అండదనలు ఇస్తుందని, వారు నిర్వహించబోయే పోరాటాలకు ప్రత్యక్షంగా సిఐటియు పాల్గొంటుందని ఆయన హామీ ఇచ్చారు. 23వ తేదీన తాడేపల్లిలో జరిగే కార్మిక ప్రదర్శన బహిరంగ సభకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని దుర్గారావు కోరారు. ఈ కార్యక్రమంలో కె.స్టీవెన్, ఎం.దుర్గారావు, సాంబయ్య, నాగేశ్వరరావు, సూర్యప్రకాష్, దుర్గాభవాని, రమాదేవి, నవనీతం, హిమాంబి,మల్లేశ్వరి, గురవయ్య, బాషా, జానీ, సుభాని, అక్కయ్య, ఆశీర్వాదం, సుబ్బారావు, శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తుళ్లూరు

జనవరి 4న విశాఖలో జరిగే కార్మిక, మహా ర్యాలీలో రాజధాని నుండి పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి పిలుపునిచ్చారు. రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మికుల విస్తృత సమావేశం ఆదివారం సాయంత్రం తుళ్లూరులోని సిఐటియు కార్యాలయం వద్ద సంఘం అధ్యక్షురాలు సిహెచ్.సుశీల అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రవి మాట్లాడుతూ ఐక్య పోరాటం నినాదంతో అన్ని సమరశీల పోరాటాల్లో అగ్రభాగాన నిలుస్తున్న సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు డిసెంబరు 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్నాయని అన్నారు. మహాసభల సందర్భంగా జనవరి 4వ తేదీన విశాఖ పట్నంలో సిఐటియు ఆధ్వర్యంలో మహా కార్మిక ర్యాలీ జరుగుతుందని చెప్పారు.

మాట్లాడుతున్న రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు రవి

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, పెట్టుబడిదారులు ఒకటై కార్మిక వర్గంపై ముప్పేట దాడి చేస్తున్నారని, స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాలలో కార్మిక వర్గం ఎన్నడూ ఇన్ని కష్టాలు ఎదుర్కొనలేదని అన్నారు. కష్టాలలో ఉన్న కార్మికులకు అండగా సిఐటియు నిలబడి పోరాడుతుం దన్నారు. రాజధాని అమరావతి స్మార్ట్ సిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచడం లేదని, వీరికి జీవో నెంబర్ 36 అమలు జరిపి రూ21 వేల జీతం చెల్లించాలని రవి కోరారు. రాజధాని అభివఅద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికులకు పని భారం పెరిగి అనారోగ్యాల పాలు అవుతున్నారని, కార్మికుల సంఖ్యను పెంచాలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులందరికీ రక్షణ పరికరాలు వెంటనే అందజేయాలని కోరారు. కార్మికులకు పిఎఫ్ సక్రమంగా జమ చేయాలని రవి కోరారు. సిఐటియు రాజధాని డివిజన్ కన్వీనర్ ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ రాజధాని పారిశుద్ధ్య కార్మికులు సంఘటితంగా సంఘం ఆధ్వర్యంలో పోరాడటం వల్ల కొన్ని సమస్యలను పరిష్కరించుకోగలిగారని రవి అన్నారు. రానున్న కాలంలో కార్మికులపై తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతుందని,దీనిని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని కోరారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా కార్మికులకు అండదండగా సిఐటియు నిలుస్తుందని అన్నారు. సమావేశంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం కార్యదర్శి కుంభ గోపిరాజు, సంఘం నాయకులు లేళ్ల సుఖవేణి, ఎన్.వీర్లంకమ్మ, అరుణ, అనురాధ, జ్యోతి, వి.జయకుమార్, ఎన్.కోటేశ్వరరావు, ముత్యాలు, పాములు, సామ్రాజ్యం, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నయసూరిని సన్మానిస్తున్న లక్ష్మణరెడ్డి

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

ప్రొఫెసర్ కొండవీటి చిన్నయసూరి

ప్రజాశక్తి - గుంటూరు

బానిస, రాచరిక వ్యవస్థలను అంతమొందించి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి నినాదాలతో ముందు కొచ్చిన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ పూర్వ ఆచార్యులు ప్రొఫెసర్ కొండవీటి చిన్నయసూరి అన్నారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమం ఆదివారం ఏసి కాలేజీలో నిర్వహించారు. ప్రజాస్వామ్య విలువలపై జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రొఫెసర్ కొండవీటి చిన్నయ సూరి ప్రసంగించారు. 18వ శతాబ్దంలో అమెరికాలో నెలకొన్న బానిస వ్యవస్థపై నాటి అమెరికా అధ్యక్షులు అబ్రహాం లింకన్ సైనిక పోరాటం చేసి విజయం సాధించారని తెలిపారు. ప్రజాస్వామ్య మనేది ప్రజల ప్రభుత్వమని, ప్రజల చేత, ప్రజల కోసమని నాటి అబ్రహాం లింకన్ ప్రపంచానికి తెలియజేశారని గుర్తుచేశారు. అసిస్టెంట్ కమిషనర్, కస్టమ్స్ ఎస్.మధుబాబు, మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తార్కిక చింతనను పెంచుకొని, జ్ఞాపక శక్తిని మెరుగు పరచుకుని, అధ్యయనం చేస్తే సత్ఫలితాలు వస్తాయని అన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రతి అంశాన్ని అధ్యయనం చేసే క్రమంలో అవగాహన పెంచుకోవాలని, సమయాన్ని వృధా చేసుకోకుండా చదువుపై శ్రద్ధ పెడితేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కార్యదర్శి కె.సతీష్, కె.పావని, కె.అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌కుమార్

రక్తనాళాల వ్యాధులపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - గుంటూరు

భారతదేశంలో వివిధ కారణాల వల్ల రక్తనాళాల సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నప్పటికీ వాటిపై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందని వ్యాస్క్యులర్ సర్జన్ డాక్టర్ విష్ణుమొలకల విజయ్‌కుమార్ అన్నారు. ఈవ్యాధిని ముందస్తు గుర్తింపు ద్వారా ప్రాణాలను, అవయవాలను రక్షిస్తుందని అన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన ఆరోగ్య సభల ఆదివారం జరిగింది. సభలో డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ నడుస్తున్నప్పుడు కాళ్ళలో నిరంతర నొప్పి, షుగర్ ఉన్న వారికి త్వరగా గాయాలు మాననప్పుడు పాదాలు చల్లగా ఉండటం, రంగు మారటం, నిస్సత్తువుగా ఉండటం, కాళ్ళ వాపు ఇబ్బందిగా, భారంగా అనిపించడం, ఆకస్మికంగా చేతిలో గాని, కాలిలో బలహీనత, మాట్లాడటంలో సమస్య, చూపు తగ్గటం, వెన్నునొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వ్యాస్క్యులర్ సజ్జన్‌ని సంప్రదించాలన్నారు. ఆలస్యమైతే కాలు తొలగింపు, పక్షవాతం, గుండెనొప్పి లాంటి తీవ్ర పరిణామాలు సంభవించవచ్చని అన్నారు. వ్యాస్క్యులర్ వ్యాధులు మన శరీర వ్యవస్థను ప్రభావితం చేస్తాయని, అప్రమత్తతతో వ్యవహరించి వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతర్ డాక్టర్ విజయ్ కుమార్‌ని అవగాహన సభ్యులు సత్కరించారు. సభలో రుమటాలజిస్ట్ డాక్టర్ దీపిక, తెలుగు పండితులు రాజన్న మాస్టారు, అనవేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, విశ్రాంత ఆంధ్రా బ్యాంక్ మేనేజర్ ఫణి కుమార్ ప్రసంగించారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

ఉద్యాన పంటలతో ఆర్థికాభివృద్ధి

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి-ఈపూరు

రైతులు ఉద్యాన పంటలు సాగు చేయటం ద్వారా ఆర్థికాభి వృద్ధి సాధిస్తారని ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని గోపువారి పాలెం గ్రామంలో గ్రామస్తుడు గోనుగుంట్ల వీరాంజనేయులు తన ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి విధానం అనుసరిం చాలన్నారు. వివిధ రకాల పండ్ల తోటలు సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చు న్నారు. సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా కరెంట్ బిల్లు ఆదా అవుతుం దన్నారు. ఉద్యాన పంటలకు సోలార్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావును మం డల టిడిపి నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, ఈపూరు, అంగలూరు సొసైటీ అధ్యక్షులు వి.హనుమయ్య, టి.బాలయ్య, డైరెక్టర్ ఐ.కోటేశ్వరరావు,డిసి చైర్మన్ వేణుగోపాలరావు, మండల అధ్యక్షులు ఆర్.మురళి,సీనియర్ నాయకులు గోపు వీరాంజ నేయులు, నర్రా కిషోర్ పాల్గొన్నారు.

మహిళకు నగదు అందజేస్తున్న వీరాస్వామి, తదితరులు

800 మందికి రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణానికి చెందిన సామాజిక సేవా కార్య కర్త గంజి వీరాస్వామి ఆధ్వర్యంలో కార్తీక మాసం పురస్క రించుకొని ఆదివారం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభ కార్యక్రమానికి ఫణిదం చేనేత సహకార సంఘం అధ్యక్షులు కట్టా శివదుర్గారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, న్యాయవాదులు పిన్నమనేని పాములయ్య, బగ్గి నరసింహారావు మాట్లాడుతూ గంజి వీరాస్వామి గత 25 సంవత్సరాలుగా ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయ మని అన్నారు. గంజి వీరాస్వామి తల్లితండ్రులు గంజి రాములు, అంజమ్మ చేనేత అడుగు పనులు చేసుకుంటూ, హోటల్ నడుపుకుంటూ వీరాస్వామిని ఇలాంటి సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించ డం హర్షణీయమన్నారు. వీరాస్వామి తల్లిదండ్రులు మర ణించాక కూడా వీరాస్వామి ఈ కార్యక్రమాలను కొనసాగిం చడం మంచి పరిణామం అని అన్నారు. ఈ సభలో వారు 800 మంది వృద్ధులు, మహిళలకు రగ్గులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న 8మంది మహిళలకు రూ.10 వేల చొప్పున, రూ.5వేల చొప్పున ముగ్గురికి ఆర్థిక సహాయం చేశారు. షేక్ జుబేదా వృద్ధునికి చెవిటి మిషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వంగర శ్రీనివాస రావు, చట్టు శ్రీనివాసరావు, పణిధరపు నాగేశ్వరరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి డి. విమల పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుపై పెరుగుతోన్న ఆసక్తి

ఆరుతడులు, ధరలపై సంశయంలో రైతులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రస్తుతానికి రబి సాగు ప్రారంభమై సుమారుగా 30, 35 రోజులు కావస్తోంది. మండల, నియోజకవర్గ స్థాయిలో రైతులు ఇంత వరకు ఏ పంట సాగు చేయాలో అనే అయో మయంలో ఉన్నారు. పోయిన సంవత్సరం పొగాకు ఇప్పటికీ అమ్ముకోలేదు. మిర్చికి దోమ, తెగుళ్లు, పప్పు శనగకి 'విల్ట్' (ఉన్న ఫణంగా ఎండిపోయో తెగుళ్లు) తెగుళ్ల సోకాయి. పత్తి దిగుబడులు తగ్గాయి. ప్రస్తుతానికి ప్రత్యామ్నాయ రైతు లకు లాభదాయకమైన పంటగా మొక్క జొన్న కన్పిస్తోం దంటున్నారు. ప్రధానంగా మొంథా తుఫాన్ ధాటికి పాడైనా పత్తి పంటను తీసివేసి ఆ స్థానంలో మొక్కజొన్న సాగు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. మొక్క జొన్నకు పోయిన సంవత్సరం మద్దతు ధర రూ. 2225 వందలుగా ఉండిం ది. ప్రస్తుతంరూ. 2400 వందలుగా ప్రకటించారు. కాబట్టి ఆరుతడులకు నీరు వస్తే దాదాపు ఎక్కువ 2000 నుంచి 2500 వందల ఎకరాల వరకు సాగుకు రైతులు మొక్కజొన్న వైపు ఆసక్తి చూపుతున్నారు. ఇది 120 రోజుల పంట. ఈ నవంబర్ ఆఖరుకు సాగు చేస్తే వచ్చే ఏడాది మార్చి ఆఖరు కు అయి పోతుంది. అయితే మధ్యలో డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలాఖల్లో నీటి తడులకు అవకాశం ఉంటే మంచి దిగుబడి వస్తుంది. పోయిన సంవత్సరం రబీలో 77 ఎకరా లలో ఈ మొక్క జొన్నసాగు అయింది. ప్రస్తుత సంవ త్సరం ఖరీఫ్‌లో 50ఎకరాల్లో సాగు చేశారు. అయితే ఈ రబీ సీజన్లో ప్రస్తుతం మొక్కజొన్నకు దిగుబడులు, రేట్లు, వ్యవ సాయ ఖర్చులు అనుకూలంగా ఉన్నాయనే ఉద్దేశంతో వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపు తున్నారు. కత్తెర పురుగుకు తట్టుకొని నిలబడితే దిగుబడి ఎకరాకు సుమారుగా 25, 30 క్వింటాళ్లు దాకా వస్తోందం టున్నారు. ఖర్చులు విషయంలో ఎకరాకు 10 నుంచి 12 కిలోల వరకు విత్తనాలు పడతాయి. ప్రస్తుతం నాలుగు కిలోల బ్యాగ్ రూ.1800, 2000లు చొప్పున అందుబాటు లో ఉంది. ఎద, బోధలుపై నాటడం వ్యవసాయానికి, ఎరు వులు, పురుగు మందులు, నీటి ఆరుతడులు, ఇతర ఖర్చులు కౌలు కాకుండా మొత్తం సుమారు రూ. 25, 30 వేల దాకా అవుతాయంటున్నారు. సాలు సగటున దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్ల దాకా వస్తోందంటున్నారు. కాబట్టి వ్యవసాయ శాఖ, ప్రభుత్వం వెంటనే ఈ మొక్క జొన్న సాగుదారులను గుర్తించి వారికి తగు సూచనలు, సలహాలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలంటున్నారు. ముఖ్యంగా పంటను అమ్ముకునేందుకు వీలుగా, అవసరాన్ని బట్టి నిల్వలకు కూడ సౌకర్యం కల్పిం చాలని రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్న పంట

తొలగిపోతున్న ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని ప్రధాన రహదారి నిత్యం ట్రాఫిక్‌తో ప్రజ లు నడిచేందుకు ఇబ్బంది పడే పరిస్థితి ఉండేది. రోడ్డు పైకి చొచ్చుకొచ్చిన వ్యాపారులు, కొనుగోలు కోసం వచ్చిన విని యోగదారుల వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసే క్రమశిక్షణ లేని పద్ధతులకు పట్టణ పోలీసులు చెక్ పెడుతున్నారు. పట్టణ సిఐ టి.వెంకటరమణ ప్రత్యేకంగా దృష్టి సారించి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తు న్నాయి. రోడ్డుపై తోపుడు బండ్లపై వ్యాపారం చేసే వారిని వారికి నష్టం కలగకుండా రోడ్డు మార్జిన్ లోపు వెనక కు జరిపించారు. ఆటోలు రోడ్డుపై నిలపకుండా చూస్తు న్నారు. పార్కింగ్ పాయింట్‌లో వాహనాలు నిలిపే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పోలీసు నిఘా పెంచారు. క్రమశిక్షణ లేకుండా రోడ్డు పై అడ్డదిడ్డంగా మెయిన్ రోడ్డుపై వాహ నాలు నిలిపితే లిఫ్టింగ్ లారీ వెంటనే అక్కడికి వచ్చి సదరు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి పెనాల్టీలు వేస్తు న్నారు. పోలీస్ చర్యలతో రహదారి విశాలంగా మారి వాహ నాలు ఎలాంటి అంతరాయం లేకుండా సాఫీగా రాకపోకలు సాగిస్తున్నాయి. ట్రాఫిక్ సమస్యపై పోలీసులు తీసుకొం టున్న చర్యలపై పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఆయా షాపుల వద్దకు వచ్చే వాహనాలు పూర్తిగా రహదారులు పైకి వస్తున్నాయి. దీనిపైనా చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ సమస్య మరింత మెరుగుపడుతుందని పట్టణ ప్రజలు చెబుతున్నారు. రామా టాకీస్ లైన్‌లో ఎక్కడా వాహనాలు నిలపకుండా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే మార్గంలోని కూరగాయల మార్కె ట్ ప్రవేశ ద్వారం వద్ద గోడకు ఆనుకుని మెయిన్ రోడ్డుపైకి నిర్మించిన నిర్మాణాలను వెనకకు జరపాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిపిన బైక్‌ను లిఫ్ట్ చేస్తున్న పోలీసులు

నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

వైసిపి కార్యాలయంపై దాడిని ఖండిస్తూ..

నిందితులను అరెస్టు చేయాలని నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్థానిక సమస్యలు ప్రభుత్వ వైఫల్యాలపై ఎమ్మెల్యే నంద మూరి బాలకృష్ణను వైసిపి ఇంచార్జ్ విమర్శించడాన్ని ఓర్వ లేక అనంతపురం జిల్లా హిందూపురం వైసిపి నియోజకవర్గ కార్యాలయంపై దాడి చేయడం హేయమని దాడికి టిడిపి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నరసరావుపేట పట్టణం గడియార స్తంభం సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్‌అంబేద్కర్ విగ్ర హానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నిర సన తెలిపారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ దాడికి ప్రోత్స హించిన, పాల్పడిన టిడిపి కూటమి నాయకులను అరెస్టు చేసి జైలుకు పంపాలన్నారు. రాష్ట్రంలో ప్రజా స్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి దాడులు తగదన్నారు. ఎన్నికల సందర్భంగా సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయ కుండా ప్రజలను మోసం చేస్తున్నారని, విశాఖ ఉక్కు పరిశ్రమపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు, సమ్మిట్‌పై ప్రజల దృష్టి మరల్చేందుకు హిందూపురం వైసిపి కార్యాల యంపై దాడికి పాల్పడ్డారన్నారు.టిడిపి కార్యాలయాల కోసం రూ.కోట్ల విలువైన భూమిని నామ మాత్రపు ఫీజుతో స్వాధీనం చేసుకునేందుకు అక్రమంగా జీఓలు సిద్ధం చేస్తు న్నా రని మండిపడ్డారు. అక్రమ మైనింగ్, సహజ వనరు లను దోచుకుంటున్నారన్నారు. అక్రమరేషన్, అక్రమ మద్యం వ్యాపారం, కేసులు, దాడులతో వైసిపి వర్గీయులను భయ పెట్టాలని చూస్తూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వైసిపి పట్టణ అధ్యక్షులు షేక్. ఖరిముల్లా, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కనక పుల్లారెడ్డి, విద్యార్థి సంఘ నాయ కులు గుజ్జర్లపూడి ఆకాష్ కుమార్, నాయకులు నాయ కులు కందుల ఎజ్రా, మనీంద్ర రెడ్డి, షేక్, అచ్చి శివకోటి, గుండాల వెంకటేష్ పాల్గొన్నారు.

చారిత్రాత్మక వేదికగా విశాఖ సమ్మిట్

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి హయాంలో వేధింపులు తట్టుకోలేక ఉన్న పరి శ్రమలు మూసేసి వెనక్కు వెళితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో కొమ్మాలపాటి మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఎంత కృషి చేస్తున్నారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటి వరకు రూ 9.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని నన్నారు. యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పించాలనే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ విదేశీ పర్యటనలతో పెట్టుబడిదారులను ఆకర్షించడంలో సఫలీకృ తుల య్యారన్నారు.

శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

లగడపాడులో శ్రమదానం

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని లగడపాడు, కన్నెగండ్లలో కాకతీయ జూనియర్ డిగ్రీ కళాశాలల జాతీయ విద్యార్థి సేవా విభాగం విద్యార్థులు పిచ్చి మొక్కలు, కంప తొలగించి శ్రమదానం చేశారు. ఆదివారం ఈ సందర్భంగా ఎన్నారై మైనేని అప్పా రావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సామా జిక బాధ్యతను నేర్పించడం అభినందనీయం అన్నారు. నేడు కొందరు యువకులు అనేక వ్యసనాలకు బానిసలై తల్లిదం డ్రులకు, సమాజానికి భారంగా మారడమే కాకుండా అసాం ఘిక శక్తులుగా తయారవుతున్నారని అలాంటి పరిస్థితుల్లో యువతకు సమాజం పట్ల బాధ్యతను గుర్తుచేసి వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి మంచి పౌరులుగా తయారు చేస్తున్న శ్రీ కాకతీయ విద్యాసంస్థల యాజమా న్యాన్ని, అధ్యాపకులను వారు అభినందించారు. వారం రోజుల కార్యక్రమానికి ఎంతో ప్రోత్సాహం అందించిన కన్నె గండ్ల గ్రామ సర్పంచ్ కోరంపల్లి వెంకట్రామయ్య, కోరం పల్లి నరేంద్రబాబూ, పెద్దింటి వెంకట్రావు, లగడ పాడు గ్రామ పెద్దలు వట్టికూటి శివయ్య, మైనేని అప్పా రావు, కోటపాటి నాగమల్లేశ్వరరావు గ్రామసర్పంచ్ నాగేశ్వర రావుకు, ప్రిన్సిపల్ అశోక్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లలో పరిశీలన

ప్రజాశక్తి - రెంటచింతల

పల్లెలకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేసేం దుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితా లిస్తున్నాయని ఏపీసీపీడీసీఎల్ ఈఈ నూతలపాటి సింగయ్య చెప్పారు. ఆదివారం పాలువాయిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రూ.48 లక్షలతో గ్రామంలో చేపట్టిన ఆర్డీఎస్ఎస్(రీవ్యాప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టం) పనులు పూర్తయ్యాయని తెలిపారు. వ్యవసాయ, గృహ అవరసరాలకు వేర్వేరు లైన్లు ఏర్పాటు చేశామన్నారు. దీని వలన గృహసరఫరాకు అంతరాయం ఉండదన్నారు. త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా జరగడం వల్ల చిరువ్యాపారులు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఏర్పడిం దన్నారు. రెంటచింతలలో ఆర్డీఎస్ఎస్ పనులు వచ్చే యేడాది జనవరి 20 నాటికల్లా పూర్తి చేయాల్సి ఉంటుం దన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక చొరవతో మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, కారంపూడి మండలాల్లో సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ట్రూడౌన్ వల్ల విద్యుత్ చార్జీల భారం బాగా తగ్గిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఈ మస్తాన్ వలి, ఎన్ సీ సీ ప్రతినిధి సీపీ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులో ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సుబ్బరత్నమ్మ, మంగళగిరిలో మాట్లాడుతున్న సిందే బాలకృష్ణ, పెదనందిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

గ్రంథాలయ ఉద్యమకారుల సేవలను గుర్తుంచుకోవాలి

ప్రజాశక్తి – గుంటూరు

గ్రంథాలయ ఉద్యమకారుల సేవలను గుర్తుంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ అన్నారు. అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్.రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం తదితరులను సన్మానించారు. ముఖ్య అతిథులుగా చేబ్రోలు ప్రభుత్వ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపాల్ వి.నాగరాజ్యలక్ష్మి, ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ చైర్మన్ గుర్రం మురళీమోహన్ హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కందుల ఝాన్సీ లక్ష్మి, విశ్రాంత ఉద్యోగి ఎం.ఎస్.సుభాని పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. ఏటుకూరులోని శాఖా గ్రంథాలయంలో మొంథా తుఫానుపై డిబేట్ నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతగా ఎన్.రాంబాబు వ్యహరించగా, టి.గిరిధర్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి – తెనాలి

స్థానిక శాఖ గ్రంథాలయంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ ఎస్.లావణ్య సుధ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ జరిగింది. గ్రంథాలయ ఉద్యమ పితామహులు ప్రముఖులను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కవి పాతూరు సుబ్రమణ్యం, ఆలపాటి కళావతి రవీంద్ర పీఠం అధ్యక్షులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎం.సుబ్బారావు, కె.పూర్ణచంద్రరావు, కె.పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపేట బాలల గ్రంథాలయంలో..

స్థానిక కొత్తపేట బాలల గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో త్రీ టౌన్ సిఐ ఎస్.సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పుస్తకాలు చదివి భారతదేశం గర్వించే పౌరులుగా తయారవ్వాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.సుజాత, లక్కరాజుసాయి, ఎ.బాలచంద్రమౌళి, టీవీఎన్ మల్లేశ్వర రావు, సిహెచ్‌శ్రీదేవి, వి.నాగేంద్ర, హరి కిషన్, పుల్లారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – మంగళగిరి

స్థానిక దామర్ల త్యాగరాజు కోమల కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ఎం చైతన్య విద్యాసంస్థల నిర్వాహకులు ఎస్.బాలకృష్ణ, రిటైర్డ్ ప్రొఫెసర్ వి.శ్రీనివాస రావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కాశీ రావు, ఎ.రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళగిరి గాలిగోపురంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల అందజేశారు. గ్రంథాలయ నిర్వాహకులు కె.సాయికిరణ్, షేక్ తాజూనా పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంగళగిరి సీకే జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రత్నబాబు మాట్లాడారు. సికె జూనియర్ కళాశాల లెక్చరర్ ఎన్.ఆనందరావు, గ్రంథాలయ అధికారి ఎన్ ఆరోగ్యం, పి.కృష్ణ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – పెదకాకాని

స్థానిక లూథర్ గిరిలోని గ్రంథాలయంలో ఆదివారం వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి నంద్యాల నాగిరెడ్డి మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతర ఏర్పాటు చేసిన పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యస్. సంగీతరావు, ఎల్.కిషోర్, బి.ప్రవీణ్, బి.ప్రభాకర్, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – పెదనందిపాడు

ప్రజలలో విజ్ఞానాన్ని పెంచి మంచి ఆలోచనలను పంచడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, విజ్ఞానదాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు వారధిగా పనిచేస్తున్నాయని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకులు డి.శివనాగేశ్వరరావు, వార్డు మెంబర్ వెలినేని శివయ్య, మంజుల, రవీంద్ర, ఆనందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – తాడేపల్లి

గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు " నేటి రాజకీయాలు విద్యార్థులపై ప్రభావం" అనే అంశంపై ఆదివారం పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీ భగవాన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు కానూరి శ్రీనివాసరావు విచ్చేయడం జరిగింది. వారి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించటమైనది. గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ భాషా పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి, విద్యార్థులు

పుస్తకం అంటే కాగితం కాదు.. జీవితాలు మార్చే శక్తి

ప్రజాశక్తి– ప్రత్తిపాడు

పుస్తకం అంటే కాగితం కాదు జీవితాలు మార్చే శక్తి అని ప్రత్తిపాడు గ్రంథాలయ శాఖ అధికారి బి.అరుణ కుమారి అన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న పలువురి చిత్రపటాలకు పూలమాల వేసి ఆమె ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయం

మల్లేశ్వర స్వామి ఆలయ సందర్శనకు జడ్జీలు

ప్రజాశక్తి – పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానాన్నంలో కార్తీక మాస ఉత్సవాలు సందర్భంగా న్యాయమూర్తి జి.స్రవంతి, చిలకలూరిపేట న్యాయమూర్తి ఐ.స్వాతి దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని,ముఖ్యంగా పారిశుద్ధ్యం, త్రాగునీరు, అన్న ప్రసాదం, క్యూలైన్ల విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. వివిధ సేవా రుసుములు ఇతరములు ద్వారా 8.5 లక్షలు ఆదాయము వచ్చిందని,అన్ని శాఖల అధికారులు ఉత్సవాల నిర్వహణలో పాల్గొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ప్రజాశక్తి – తాడికొండ

స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని అక్కదేవతల చెరువు కట్టపై సర్వే నెంబర్ మూడు 369/2,370లో అనధికారికంగా చేపట్టిన మస్జీద్, హిందూ దేవాలయ నిర్మాణ పనులను పంచాయతీ, రెవెన్యూ ,పోలీస్ అధికారుల ఆదివారం కూల్చి వేశారు. భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. మూడు జేసీబీలతో నిర్మాణాలను ధ్వంసం చేశారు. తాము చేపట్టిన నిర్మాణ పనులను తొలగించవద్దని ముస్లింలు బైఠాయించారు. అయినా నిర్మాణ పనులను అధికారులు తొలగించారు. నిర్మాణ ప్రదేశంలోనికి ఎవరు వెళ్లకుండా కందకాలను తవ్వి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఎవరైనా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ మెహర్ కుమార్, సిఐ కె.వాసు, తాడికొండ పంచాయతీ కార్యదర్శి రమణయ్య, కంతేరు పంచాయతీ కార్యదర్శి షేక్ రెహమాన్ ఆధ్వర్యంలో నిర్మాణాలను తొలగించారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

ఘనంగా అమరావతి మెడోస్ శంకుస్థాపన

ప్రజాశక్తి – తాడేపల్లి రూరల్

శ్రీ లలిత ఇన్ ఫ్రా వారి అమరావతి మెడోస్ భూమి పూజ కార్యక్రమం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని శ్రీలలిత, అమరావతి మెడోస్ అధినేతలు నేరెళ్ల మురళీ మోహన కృష్ణ, ఆత్మకూరి సుబ్బారావు దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాడేపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఉన్న రియల్టర్లు, బిల్డర్లు ఇచ్చేసి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అమరావతి మెడోస్ అధినేత నేరెళ్ల మురళీ మోహన కృష్ణ మాట్లాడుతూ గతంలోనే నేరెళ్ల కన్‌స్ట్రక్షన్స్ పేరుతో మంగళగిరి, చిన్న కాకాని ప్రాంతాలలో నిర్మాణాలు పూర్తి చేసి, కస్టమర్లు, ప్రజల మన్ననలు పొందామని అన్నారు. కుంచనపల్లి గ్రామంలో మూడు ఎకరాల 26 సెంట్లు విస్తీర్ణంలో సకల సౌకర్యాలతో, నాణ్యమైన నిర్మాణాలను చేపడుతున్నామని ఆయన తెలిపారు. 300 పైగా ఫ్లాట్లుతో అమరావతి మెడోస్ నిర్మాణం చేస్తున్నామన్నారు. ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణంలో క్లబ్ హౌస్ , స్విమ్మింగ్ పూల్, క్లినిక్, స్పా, యోగ చేసుకునేందుకు వీలుగా కష్టమర్ వినియోగదారులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ నిర్మాణాలు చేస్తున్నామన్నారు. ఆత్మకూరి సుబ్బారావు మాట్లాడుతూ నాణ్యమైన నిర్మాణాలు చేపట్టి, కస్టమర్లు ఇష్టపడి మెచ్చే విధంగా రాజీలేని నిర్మాణాలను త్వరతి గతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు బలరామకృష్ణ, అమ్మిశెట్టి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న అమరావతి మెడోస్ అధినేతలు

క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి – తాడికొండ

మండలంలోని మోతడక గ్రామ కాకతీయ కన్వెన్షన్ సొసైటీలో వయోవృద్ధుల కోసం రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన క్లినిక్‌ను మాజీ రాజ్యసభ సభ్యులు యలమంచిలి శివాజీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ఉంటున్న వారికీ తక్షణ వైద్య సహాయం కొరకు క్లినిక్ ఏర్పాటు చేయడం అభినందననీయం అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొత్తపల్లి రమేష్ కృష్ణచంద్ర, పాలకవర్గ సభ్యులు గంటా పున్నారావు, డాక్టర్ ఎర్ర నాగేశ్వరరావు, దామచర్ల శ్రీనివాసరావు, దాసరి రవికుమార్, నూతలపాటి తిరుపతయ్య, పుట్లి శంకరరావు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బెటాలియన్ అధికారులు

ఎపిఎస్‌పి 6వ బెటాలియన్ సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి – మంగళగిరి

ఫిట్ ఇండియా ఫిట్నెస్ కార్యక్రమంలో భాగంగా మంగళగిరిలోని ఆరవపటాలము ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించింది. సైకిల్ ర్యాలీ ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ నుండి ఎన్నారై వై జంక్షన్ వరకు జరిగింది. ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ బెటాలియన్స్ ఐజి బిజరాజకుమారి, ఏపిఎస్‌పి బెటాలియన్ కమాండెంట్ కె.నగేష్‌బాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విన్నకోటను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

విన్నకోట శ్రీనివాసరావుకు సత్కారం

ప్రజాశక్తి – మంగళగిరి

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన విన్నకోట శ్రీనివాసరావును స్థానిక 28వ వార్డు బాపనయ్య నగర్ టిడిపి నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విన్నకోటకు నాయకులు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తురక వీరశేఖరు, తోట కరుణ కుమార్, కార్యనిర్వహణ కార్యదర్శి కోలా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు దొడ్డాకుల శ్రీనివాసరావు, గాజుల క్రాంతి కుమార్, పసుపులేటి సదాశివరావు, సుంకర ప్రసాద్, షేక్ రజియా, కోలా వెంకటనారాయణ, తోట శరత్ పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందితో నిర్వాహకులు

200 మందికి ఉచితంగా వైద్య సేవలు

ప్రజాశక్తి – పెదనందిపాడు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిడిపి సీనియర్ నాయకులు రావి శివరామకృష్ణయ్య, దివ్వి నాగరాజుల ఆధ్వర్యంలో ఏషియస్ వాస్కులర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వెరికోస్ వీన్స్ వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు రావి శివరామకృష్ణయ్య తెలిపారు. ఎన్ఆర్ఐ టిడిపి నాయకులు ఆళ్ల వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య చికిత్సలు అందించడానికి కృషి చేస్తున్న శివరామకృష్ణయ్యకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, టిడిపి మండల అధ్యక్షులు కోడూరి రాంబాబు, మక్కెన జవహర్ రాణి, కోడూరి నాగేశ్వరరావు, బండి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

348వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి– తాడేపల్లి

చట్టపరంగా తమకు రావలసిన బకాయిల కోసం ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 348 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు జిల్లా నాయకులు బాబు ప్రసాద్, పట్టణ కార్యదర్శి విదుర్గారావు, కార్మికుల నాయకులు కె.స్టీవెన్, ఎం.సాంబశివరావు, సుభాని ప్రారంభించారు. దీక్షల్లో వేముల రోజులు, వి.లక్ష్మి, డి.రమణమ్మ, ఎం.శారదా, బి.నవనీతమ్మ కూర్చున్నారు.

పోటీలలో తలపడుతున్న వివిధ జట్లు

ఉత్కంఠ భరితంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల యందు రెండవ రోజు ఉత్కంఠ భరితంగా కబడ్డీ పోటీలు జరుగుతున్నాయి. బాలికల విభాగంలో కడప వర్సెస్ శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచులు శ్రీకాకుళం బాలికల జట్టు విజయం సాధించింది. బాలురు విభాగంలో అనంతపురం వర్సెస్ విజయనగరం మధ్య జరిగిన పోటీల్లో అనంతపురం బాలురు జట్టు విజయం సాధించింది. పోటీలను ఫ్లడ్‌లైట్‌ల వెలుతురులో, ప్రేక్షకులు చూసేందుకు వీలుగా గ్యాలరీని ఏర్పాటు చేశారు అని నిర్వాహకులు గంగినేని రాఘవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రెటరీ ఎన్.సురేష్ కుమార్, డివిజనల్ సెక్రటరీ చిరంజీవి, రాధా కృష్ణమూర్తి, చినరామయ్య, జోన్ సెక్రటరీ వీరాంజనేయులు, ప్రెసిడెంట్ బాజు రాజేష్ మద్దం వెంకటేశ్వర్లు వెంకట రత్నం అంకారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనసమారాధన

ప్రజాశక్తి - గుంటూరు

హాయ్‌ల్యాండ్‌లో కిట్స్ కళాశాల సిబ్బంది కార్తీక వన సమారాధన ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ తమ కళాశాలలో దశాబ్దాలుగా కొనసాగుతున్న సాంప్రదాయ ప్రకారం ఇది ఇరు కళాశాలకు చెందిన బోధన, బోధనేతర సిబ్బందితో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. యాజమాన్యం వారి కుటుంబ సభ్యులు, కళాశాల సిబ్బంది ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయ శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ కె.హరిబాబు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నాయి.

మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు

కౌలు రైతుల హక్కుల సాధనకు పోరాటం

- వ్యవసాయానికి బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేటాయించాలి
- కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలి
- సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు కె. రామారావు, వై.రాధాకృష్ణ
- 19న యడ్లపాడులో జిల్లా 4వ మహాసభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కౌలు రైతులలో చైతన్యం నింపి హక్కులు, డిమాండ్ల సాధనకు పోరాటాలకు సిద్ధం చేసేందుకు కౌలు రైతు సంఘం కృషి చేస్తుందని ఏపి కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రామారావు, వై.రాధాకృష్ణ అన్నారు. ఈ నెల 19 న మండల కేంద్రం యడ్లపాడులో జరగనున్న కౌలు రైతు సంఘం 4 వ జిల్లా మహా సభలు జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని కౌలు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. వ్యవసాయమే జీవనాధారమైన గ్రామీణ ప్రాంతాలలో 70 శాతం పైగా కౌలు రైతులే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వ్యవసాయ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న కొద్దిపాటి రాయితీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పెట్టుబడి సహాయం, అన్నదాత సుఖీభవ పథకం ఇవేమీ వర్తించడం లేదన్నారు.దేశంలో, రాష్ట్రంలో 70 శాతం మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారమైన వ్యవసాయానికి బడ్జెట్లో 50 శాతం నిధులు కేటాయించి మద్దతు ధరల చట్టం చేయాలన్నారు. పంటల ఎగుమతి దిగుమతి విధానంలో ధనిక దేశాలు అనుసరిస్తున్న విధానాలకు కేంద్ర ప్రభుత్వ లంగుబాటు ధోరణి తగదన్నారు. మార్కెట్ యార్డుల ద్వారా సిసిఐ కొనుగోళ్లు జరపాలని తుఫాను,తెగుళ్లతో దెబ్బతిన్న పంటలకు ఇన్ పుట్ సబ్సిడీ, సిసిఆర్.సి కార్డు పొందిన కౌలు రైతులకు రూ 2 లక్షల వరకు హామీ లేని పంట ఋణాల మంజూరుకు సమగ్ర చట్టం తీసుకురావాలని ఉచిత పంటల భీమాతో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు వర్తింప చేస్తామన్న హామీని టిడిపి కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. కౌలు రైతులను గుర్తించడంలో, పథకం అమలకు విధివిధానాలను రూపొందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా నూతన కౌలు చట్టం అమలుకు ముసాయిదా రూపొందించి చట్టం చేయకుండా మోసం చేసిందన్నారు. గుర్తింపు కార్డు లేని కౌలు రైతులు పంట రుణాలు,పంట నష్ట పరిహారం, పంటల భీమా వర్తించక నష్టపోతున్నారన్నారు.కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఐక్య ఉద్యమాలకు కార్యచరణ రూపొందించేందుకు ఈ నెల 19 న యడ్లపాడులో జరగనున్న కౌలు రైతు సంఘం జిల్లా 4వ మహా సభలో కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

చేపల మేతగా.. కోళ్ల వ్యర్థాలు

- ప్రజారోగ్యానికి, పర్యావరణానికి చేటు
- అనధికార చెరువులపై ఫిర్యాదు చేసినా పట్టని అధికారులు

ప్రజాశక్తి - వినుకొండ

చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలను వేస్తూ కొందరు వ్యాపారస్తులు ప్రజారోగ్యంతో చెలగాటమాడు తున్నారు. నూజెండ్ల మండలం ముక్కెళ్లపాడు పంచాయతీ పరిధిలో సుమారు 100 ఎకరాల్లో పైగా చెరువులు, కుంటలను ఏర్పాటు చేసి కొందరు చేపలను అనధికారికంగా పెంచుతున్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారు 20 ఏళ్లపాటు లీజుకు తీసుకుని ఈ చెరువులు వేస్తున్నారు. వీటిల్లో చేపలకు కోళ్లు, మేకలు, తదితర జీవాల అర్థాలను ఆహారంగా వేస్తూ పర్యావరణానికి చేటు చేస్తూ ప్రజారోగ్యంతోనూ చెలగాటమాడుతున్నారు. చేపల చెరువులను ముక్కెళ్లపాడు వాగు పరీవాహక ప్రాంతంలో నీరు ఆధారంగా నిర్వహిస్తున్నారు. ఈ చెరువుల వద్ద కోళ్ల వ్యర్థాలను నిల్వ ఉంచడం, నీటిని వాగులోకి వదలడం వల్ల ఆ వైరస్ విస్తరించి పరిసర ప్రాంతాల్లోని పలువురు వ్యాధులకు గురవుతున్నారు. వాగు నీటిని తాగిన మూగ జీవాలు వ్యాధులకు గురవుతున్నాయి. భూగర్భ జలాలు సైతం కలుషితం కావడంతోపాటు పలు గ్రామాల్లో రక్షిత నీటి పథకాలకూ వాగునీరు వెళ్లడం వల్ల వాటిని తాగిన జనం అనారోగ్యాలకు గురవుతున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ఇటువంటి మాంసం వ్యర్థాలను చెరువులోని చేపలకు ఆహారంగా వేయడాన్ని నిషేధిస్తూ 2016లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినా ఇక్కడవేమీ అమలుకావడం లేదు. చికెన్, మటన్ దుకాణాల వద్ద నుండి వ్యర్థాలను ప్రత్యేక వాహనాల్లో చెరువుల వద్దకు తరలిస్తున్నారు. కిలో వ్యర్థాలకు రూ.5-8 చెల్లిస్తుండడంతో దుకాణాల వారు వ్యర్థాలను రోజుల తరబడి డ్రమ్ముల్లో వ్యర్థాలను పోగేసి అమ్ముకుంటున్నారు. ఈ వ్యర్థాలను తినడం వల్ల చేపలు త్వరగా బరువు పెరగడంతో పాటు మేత ఖర్చు కూడా తగ్గుతుంది. చేపలకు సాధారణంగా తవుడు, సోయాబీన్ వంటి వాటితో తయారు చేసిన మేతను వాడుతారు. ఈ మేత మార్కెట్లో కిలో రూ.30 వరకు ఉంటుంది. కిలో చేపను పెంచడానికి సుమారు రూ.50 ఖర్చయితే కోళ్ల వ్యర్థాలతో ఆ ఖర్చు రూ.30లోపే అవుతుంది. అయితే ఈ చేపలను తిన్నవారికి కాలేయ, జీర్ణకోశ సమస్యలతో పాటు పేగులో పుండ్లు, గ్యాస్టిక్, మలబద్ధకం, పైల్స్ చర్మవ్యాధులు వంటివి వస్తాయని, మహిళలకు నెలసరి, 10 రకాల క్యాన్సర్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్నారులైతే త్వరగా అనారోగ్యం బారిన పడతారని చెబుతున్నారు. అనుమతులు లేకుండా చేపల చెరువులు, కోళ్ల వ్యర్థాలో చేపల పెంపకంపై మత్స్యశాఖ అధికారులకు గత నెలలో ముక్కెళ్లపాడు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇక్కడ జరుగుతున్నదంతా వివరించారు. అయినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

104 సిబ్బందికి బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - గుంటూరు

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 104 సిబ్బందికి అరబిందో నుంచి రావాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, ఎర్న్ లీవుల డబ్బుల విషయంలో అన్యాయం జరిగిందనీ, ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు ఇప్పించాలని సిఐటియు అనుబంధ ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు గోరంట్ల సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో 104 మెడికల్ ఎమర్జెన్సీ యూనిట్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తూ ప్రజాసంజీవనిగా పేరు తెచ్చుకున్న 104 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల వలయంలో చిక్కుకున్నారని, చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. డిఈఓలకు ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్ జీవో ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని, 104లో ఫార్మాసిస్టను నియమించాలని, అప్పటివరకు డిఈఓలకు డ్రగ్స్ నిర్వహణ బాధ్యతలు తప్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగు లకు హెల్త్ కార్డులు ఇప్పించాలని, వాహనాలకు ఇన్సూరెన్స్, ఫిటినెస్ లు వెంటనే చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆలూరి శ్రీ హర్ష, కోశాధికారి ఐ.నాగులు, నాయకులు సూర్యనారాయణ, కొండలరావు, విజయ్, హరికృష్ణ, సాయిరాం పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం సాగుకు ప్రోత్సాహం

- ఉద్యాన పంటలకు రాయితీలు
- రైతులు ఉపయోగించుకోవాలి
- ఉద్యాన శాఖ ఏడి ఐ. వెంకట్రావు

పల్నాడు జిల్లాలో అయిల్ ఫాం సాగు క్రమంగా పెరుగుతుందని ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరక్టర్ ఐ. వెంకట్రావు తెలిపారు. ప్రస్తుతం 8 మండలాలోని 2500 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ ఫాం సాగు అవుతుందని ఆయన వెల్లడించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

- ప్రజాశక్తి, గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆయిల్ ఫాం సాగుకు ఇస్తున్న ప్రోత్సాహకాలు?

పల్నాడు జిల్లాలో అమరావతి, బెల్లంకొండ, సత్తెనపల్లి, రాజుపాలెం, మాచవరం, నాదెండ్ల, ఈపూరు, పిడుగురాళ్ల మండలాల్లో ఈ పంట సాగు అవుతోంది. నీటి సదుపాయం వున్న రైతులు ఎవరైనా ఈ పంట సాగు చేయవచ్చు. ఈ పంట సాగు కోసం ఎకరానికి 150 మొక్కలు రైతులకు ఉచితంగా ఇస్తాం. ఒక్కో మొక్క రూ.193 ఖరీదు గల మొక్కలను అందిస్తాం. ఎరువుల నిమిత్తం ఏడాదికి రూ.5250 ప్రోత్సాహంగా ఇస్తాం. అలాగే ఆయిల్‌ఫాం సాగుచేస్తూనే అంతర్ పంటలు వేసుకోవడానికి కూడా సబ్సిడీపై ఎరువుల కోసం నాలుగు ఏళ్లలో రూ.21 వేలు గరిష్టంగా సబ్సిడీగా ఇస్తాం. సూక్ష్మ సేద్యం ద్వారా నీటి వసతిని కూడా ఉపయోగించుకోవచ్చు.

ఉద్యాన శాఖ ద్వారా వివిధ పంటలకు ఇస్తున్న రాయితీలు?

చిన్న తరహా నర్సరీలకు 50 శాతం రాయితీ ఇస్తాం. గరిష్టంగా ఒక్కో రైతుకు రూ.10 లక్షల వరకు ఇస్తాం. చిన్న తరహా పుట్టగొడుగుల యూనిట్లకు 50 శాతం రాయితీ ఉంది. రాయితీ గరిష్టంగా రూ.లక్ష వరకు ఇస్తాం. కమ్యూనిటీ ఫారం పాండ్ కింద 75 శాతం రాయితీతో గరిష్టంగా రూ.18 లక్షల రాయితీ వస్తుంది. వ్యక్తిగత ఫారం పాండ్ 50 శాతం రాయితీపై రూ.75000 వేలు వరకు ఇస్తాం. షేడ్ నెట్ లో నర్సరీ కల్టివేషన్‌కు 50 శాతం రాయితీతో రూ.22.50 లక్షల వరకు ఇస్తాం. కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంకోసం 5 వేల టన్నుల సామర్థ్యంపై 35 శాతం రాయితీపై రూ.కోటి 68 లక్షల వరకు రాయితీ వస్తుంది. ప్రైమరీ, మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్ 35 శాతం రాయితో యూనిట్‌కు రూ.12.25 లక్షలు ఇస్తాం. సోలార్ క్రాప్ డ్రయర్ 40 శాతం రాయితీపై 70 కిలోల సామర్థ్యంపై రూ.లక్ష రాయితీ, 100 కిలోల సామర్థ్యంకు రూ.1.40 లక్షల రాయితీ వస్తుంది..

పండ్ల, కూరగాయలు, పూల తోటలకు రాయితీలు?

మామిడికి 7.5 మెట్రిక్ టన్నులకు హెక్టారుకు రూ.30 వేలు, 2 మెట్రిక్ టన్నులకు రూ.72 వేలు, జామ 3 మెట్రిక్ టన్నులకు హెక్టారుకు రూ.48 వేలు, బత్తాయి, నిమ్మకి రూ.30 వేలు, రేగు, కోకో రూ.18 వేలు, పైనాపిల్ రూ..26 వేలు, అరటి రూ.42 వేలు, బప్పాయి రూ.18 వేలు, డ్రాగన్ ఫ్రూట్ రూ 1.62 లక్షలు, అవకాడో రూ. 30 వేలు, హైబ్రిడ్ చింత రూ. 18000, బంతి, చామంతి, మల్లె, కనకాంబరం, లిల్లీ ఇతర పూల తోటలకు రూ.20 వేలు, హైబ్రిడ్ కూరగాయలు పెంపకంలో నూతన సాంకేతికత కు రూ.24 వేలు అందిస్తున్నాం.

జిల్లాలో ప్రస్తుతం ఉద్యాన పంటలు పరిస్థితి?

జిల్లాలోని ఉద్యాన పంటల పరిస్థితి బాగుంది. బప్పాయి, జామ, మామిడి కూరగాయాల తోటలు, పసుపు, మిర్చి పంటలన్నీ ఆశాజనకంగా ఉన్నాయి.. బప్పాయి, బత్తాయి,జామ దిగుబడులు బాగున్నాయి. అన్ని రకాల పండ్ల తోటలు కలిపి 7700 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.